ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3, కనిష్ఠం 18.3

నిజామాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 16 జనవరి 2025


వర్చువల్‌లో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

పసుపు రైతు కల నెరవేరింది!

- జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు
- రైతుల మూడు దశాబ్దాల పోరాట ఫలితం
- పసుపునకు దక్కనున్న ప్రాధాన్యత
- పరిశోధన, మార్కెటింగ్, స్టోరేజీ, ప్రాసెసింగ్‌లలో రైతులకు అందనున్న శిక్షణ
- హామీని నిలబెట్టుకున్న ఎంపీ
- నిజామాబాద్‌లోనే ప్రధాన కార్యాలయం ఏర్పాటు కోసం భవనాల పరిశీలన





పసుపు రైతుల కల నెరవేరింది. జిల్లాలో పసుపుబోర్డు ఏర్పాటుతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పసుపు బోర్డు కోసం రైతులు మూడు దశాబ్దాలుగా చేసిన పోరాటం ఫలించింది. నిజామాబాద్ నుంచి ఢిల్లీ వరకు వెళ్లి రైతులు పసుపు బోర్డు కోసం పోరాడారు. గత రెండేళ్లుగా పసుపుబోర్డు ఏర్పాటు కోసం కేంద్రం చర్యలు చేపట్టింది. గత ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చి.. సంక్రాంతి పండుగ రోజున జిల్లాలో బోర్డు ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నారు. మూడు దశాబ్దాల పాటు రైతులు చేసిన పోరాటాల ఫలితం నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌తో సాధ్యమైంది. ఈ బోర్డు ఏర్పాటుతో రాష్ట్ర పసుపు రైతులతోపాటు ఇతర రాష్ట్ర రైతులకూ మేలు జరుగనుంది. పసుపు పండించే రైతులకు గిట్టుబాటు ధర దక్కనుంది.

నిజామాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నైజాం కాలం నుంచి పసుపు సాగుచేస్తున్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా రైతులు సాగును వదల్లేదు. ఆర్మూర్ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లోని రైతులు ఈ సాగును దశాబ్దాల తరబడి కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం మూడోతరం రైతులు పసుపు సాగును చేస్తున్నారు. అప్పటినుంచి ఇప్పటివరకు సాగుచేస్తున్న పసుపునకు మద్దతు ధర లేక గిట్టుబాటు కాక గత కొన్నేళ్లుగా ఆందోళనలు చేపట్టారు. మూడు దశాబ్దాల నుంచి పసుపునకు బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఆర్మూర్ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలను కొనసాగించారు. పసుపుబోర్డు ఏర్పాటుకు పూర్తిస్థాయిలో ఆందోళనలు చేశారు. రాష్ట్రంలో ఉమ్మడి వరంగల్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పసుపు కొంత మేరసాగు అవుతుండగా జిల్లాలోనే అత్యధికంగా రైతులు పసుపు సాగుచేస్తున్నారు. జిల్లాలోనే సాగు ఎక్కువగా ఉండడంతో ఇచ్చిడి రైతులే ఆందోళనలు చేపట్టారు. వీరికి జగిత్యాల, నిర్మల్ రైతులు కూడా మద్దతునిచ్చారు. పసుపుబోర్డు ఏర్పాటు చేయాలని పసుపునకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలని పట్టుబట్టారు. గత ప్రభుత్వాల హయాంలో హామీలు ఇచ్చినా అవి మాత్రం కార్యరూపం దాల్చలేదు.

• పసుపు బోర్డును ప్రారంభించిన కేంద్ర మంత్రి

గతఅసెంబ్లీ ఎన్నికల సమయంలో మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లో జరిగిన బహిరంగ సభల్లో పాల్గొన్న ప్రధాని మోదీ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరపున ఉత్తర్వులు జారీ చేశారు. పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు గెజిట్ కూడా విడుదల చేశారు. దానిలో భాగంగానే సంక్రాంతి రోజు బోర్డును ఏర్పాటు చేశారు. న్యూఢిల్లీ నుంచి వర్చువల్‌గా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయాల్ ప్రారంభించారు. జిల్లాకు చెందిన బీజేపీ నేత పల్లె గంగారెడ్డిని పసుపుబోర్డు చైర్మన్‌గా నియమించారు. కేంద్రప్రభుత్వం అధికారికంగాబోర్డును ఏర్పాటుచేయడంతో ఇక కార్యకలాపాలను జిల్లా నుంచే ప్రారంభించనున్నారు. రాష్ట్రంతోపాటు 20రాష్ట్రాల పరిధిలో పసుపు సాగు అవుతున్నందున ఇక్కడినుంచే కార్యకలాపాలను నిర్వహించనున్నారు.

• జిల్లాలోనే ప్రత్యేక కార్యాలయం

పసుపు పరిశోధన కోసం జిల్లాలోనే ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు కానుంది. పసుపుబోర్డు ఆధ్వర్యంలో ఎగుమతులు, స్టోరేజ్, మార్కెటింగ్, ప్రాసెసింగ్, రీసర్చ్‌కు సంబంధించిన విభాగాలు ఏర్పాటు కానున్నాయి. వీటి ఆధ్వర్యంలో రైతులకు సాగుపై అవగాహన కల్పిస్తారు. అధిక దిగుబడితోపాటు కర్క్యుమెన్ ఎక్కువగా ఉండే పసుపు సాగు చేసేలా ప్రోత్సాహన్ని కల్పిస్తారు. రైతులు పండించిన పంటను ప్రాసెస్ చేయడంతో పాటు తగినవిధంగా మార్కెట్ చేయడానికి మెలకువలను నేర్పిస్తారు. పసుపునకు సరైన ధరలేని సమయంలో నిలువ చేయడంపై అవగాహన కల్పిస్తారు. వాటికి అవసరమైన గోదాములను ఏర్పాటు చేస్తారు. పసుపులో అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను ప్రోత్సహించడానికి పరిశోధనలు కొనసాగిస్తారు. ఇక రైతులు పండించే పసుపునకు గిట్టుబాటు ధర వచ్చే అవకాశం ఉంది. ఇక్కడి నుంచే ఇతర దేశాలకూ ఎగుమతి కానుంది.

• మాట నిలబెట్టుకున్న ఎంపీ అర్వింద్

2019 ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీచేసిన ఎంపీ అర్వింద్ పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చి పోటీచేశారు. పసుపుబోర్డు కోసం ఢిల్లీస్థాయిలో ప్రయత్నాలు చేశారు. జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చిన ఎంపీ అర్వింద్ మాట నిలబెట్టుకున్నారు. ఐదేళ్లపాటు ఢిల్లీ స్థాయిలో ప్రయత్నాలు చేశారు. అన్ని శాఖల మంత్రులను కలవడంతో పాటు ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్లి బోర్డు ఏర్పాటు అయ్యేలా కృషిచేశారు. రెండు దఫాలు పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన బోర్డుతో పాటు మరిన్ని పరిశ్రమలు వచ్చేలా ప్రయత్నాలను చేస్తున్నారు. బోర్డు ఏర్పాటు అయ్యేలా కృషిచేసిన ఎంపీ అర్వింద్ పట్ల రైతులతోపాటు పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

• కార్యాలయం ఏర్పాటు కోసం పరిశీలన

జిల్లాలో పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు కోసం భవనాలను పరిశీలిస్తున్నారు. నిజామాబాద్‌లో ప్రస్తుతం స్పైసెస్ బోర్డు కార్యాలయం కొనసాగుతోంది. అది చిన్నగా ఉండటంతో పసుపు బోర్డు కోసం ఒక భవనాన్ని తీసుకొని ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రప్రభుత్వం స్థలం ఇవ్వగానే నూతన భవనాన్ని కూడా నిజామాబాద్‌లో నిర్మించేందుకు సిద్ధమవుతున్నారు. పసుపుబోర్డులో పలురకాల (తరువాయి 8వ పేజీలో)

పసుపుబోర్డు ప్రారంభం

- ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- పాల్గొన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ అర్వింద్
- రైతులకు మేలు జరుగుతుందన్న కేంద్ర మంత్రి

నిజామాబాద్, జనవరి15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటు శుపరిణామమని, ప్రధాని మోదీ మహబూబ్‌నగర్‌లో ప్రకటించిన హామీ మేరకు బోర్డుఏర్పాటు చేశామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీ నుంచి వర్చువల్‌గా మంగళవారం నిజామాబాద్‌లో పసుపు బోర్డును ఆయన ఎంపీ అర్వింద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. కుంభమేళా రోజున బోర్డు ఏర్పాటు చేయడం రైతులకు కలిసి వస్తుందన్నారు. ప్రధాని మోదీ హయాంలో దేశానికి ప్రపంచ దేశాలతో సంబంధాలు మెరుగుపడ్డాయని అన్నారు. పసుపు 20రాష్ట్రాల పరిధిలో సాగు అవుతుందన్నారు. దేశంలో 30రకాల వరకు పసుపు రకాలను రైతులు సాగు చేస్తున్నారని (తరువాయి 8వ పేజీలో)


మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్


మాట్లాడుతున్న గంగారెడ్డి


హాజరైన రైతులు, నాయకులు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి

సాగు భూముల గుర్తింపునకు సర్వే

- గ్రామాల్లో నేటి నుంచి 20 వరకు
- క్షేత్రస్థాయిలో పర్యటించనున్న అధికారులు
- అధికారులు, ఉద్యోగులను సిద్ధం చేసిన యంత్రాంగం
- సాగు భూములకే వర్తించనున్న రైతు భరోసా
- వ్యవసాయేతర భూములు జాబితా నుంచి తొలగింపు



నిజామాబాద్, జనవరి15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తుండటంతో జిల్లాలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు సర్వేకు సిద్ధమవుతున్నారు. నేటి నుంచి 20 వరకు అన్ని గ్రామాల పరిధిలో సర్వేను చేపట్టనున్నారు. జిల్లాలోని సాగు భూముల వివరాలు తీసుకోనున్నారు. నిరుపయోగం గా ఉన్న భూములను గుర్తించి జాబితా నుంచి తొలగించనున్నారు. గ్రామాలు, నగరాల పరిధిలోని వెంచర్లు, రోడ్లు, సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించి చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో సాగయ్యే భూములకు మాత్రమే రైతుభరోసాను ఇవ్వనున్నారు. ఈనెల 26 నుంచి ప్రభుత్వం రైతుభరోసాను ఇవ్వనుండటంతో ముందస్తుగా ఈ సర్వేను చేపడుతున్నారు. ఇప్పటికే అధికారులను, ఉద్యోగులను సిద్ధం చేసిన యంత్రాంగం ఐదు రోజుల పాటు పూర్తిస్థాయిలో చేసేందుకు సిద్ధమవుతున్నారు. సర్వే పూర్తయిన తర్వాత మండల స్థాయి అధికారులు ధృవీకరించిన మీదట రైతుల ఖాతాల్లో భరోసాను వేయనున్నారు.

ఐదున్నర లక్షల ఎకరాల సాగుభూములు

జిల్లాలో సాగుకు యోగ్యమైన భూములు సుమారు ఐదున్నర లక్షల ఎకరాల వరకు ఉంది. ఉంది. అధికారుల లెక్కల ప్రకారం 2లక్షల 73వేలకు పైగా రైతులు ఉన్నారు. వీరంతా భూములను కలిగి ఉండటంతో పాటు గత ప్రభుత్వ హయాంలో రైతుబంధును తీసుకున్నారు. వీరిలో ఎకరంలోపు ఉన్న రైతులతో పాటు 10 ఎకరాలకు పైగా ఉన్న రైతులు కూడా జిల్లాలో ఉన్నారు. జిల్లావ్యాప్తంగా సాగుకు యోగ్యమైన భూములతోపాటు పట్టాలు ఉండి వ్యవసాయం చేయని భూములు కూడా ఉన్నాయి. వీటన్నింటికీ గత ప్రభుత్వ హయాంలో పట్టాదారుల పేర్ల మీద రైతుబంధును అందించారు. వీటిలో ప్రభుత్వ భూములు, శిఖం భూములు, చెరువులో మునిగి ఉండే భూములు, వెంచర్ భూములు, గతంలో ప్రభుత్వం సేకరించిన భూములు, జాతీయ రహదారులకు సేకరించిన భూములు, గుట్టలు, పట్టాలు ఉండి సాగుకు యోగ్యంకాని భూములకు కూడా రైతుబంధును గత ప్రభుత్వ హయాంలో ఇచ్చారు. జిల్లాలో వాస్తవిక లెక్కలను తీసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

545 గ్రామాల్లో సర్వే

జిల్లాలోని 545 గ్రామాల పరిధిలో నేటి నుంచి రైతుభరోసా కోసం సర్వేను చేపడుతున్నారు. వ్యవసాయ, రెవెన్యూ, ఇతర శాఖల ఉద్యోగుల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల పరిధిలో ఈ సర్వేను నిర్వహించనున్నారు. మండల స్థాయి అధికారులు ఈ సర్వేలో పాల్గొననున్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు సర్వేను గ్రామాల వారిగా నిర్వహిస్తారు. ఈ 5 రోజుల పాటు ఆయా గ్రామాల్లో పర్యటిస్తారు. గ్రామంలో మొత్తం భూములు ఎన్ని ఉన్నాయో సర్వేనెంబర్ల వారిగా పరిశీలిస్తారు. వీటిలో ఎంతభూమి సాగులో ఉందో పరిశీలిస్తారు. ఆ భూముల సర్వే నెంబర్ల ఆధారంగా నమోదు చేస్తారు. సాగుకు యోగ్యం కాని (తరువాయి 8వ పేజీలో)


గాలిపటాలు ఎగరవేస్తున్న దృశ్యం


ఇంటి ఎదుట ముగ్గు వేస్తున్న యువతి



సంబురంగా సంక్రాంతి వేడుకలు

- ఆలయాల్లో ఉత్తరాయన పుణ్యకాల పూజలు
- నోములకు ప్రత్యేక పూజలు
- ముగ్గులతో సంక్రాంతికి స్వాగతం
- గాలిపటాలతో యువత సందడి

నిజామాబాద్ కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సంక్రాంతి పండుగ వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సంక్రాంతి పురుషుడికి ఘనంగా స్వాగతం పలికారు. ఇంటిముందు మహిళలు వివిధరకాల ముగ్గులను వేసి అందులో సప్తవర్ణాలతో తీర్చిదిద్ది సంక్రాంతికి స్వాగతం పలికారు. సంక్రాంతి పండుగ రోజున ఇంటి ముందు పొంగలిని తయారుచేసి నైవేద్యంగా పెట్టడంతో పాటు గొబ్బెమ్మలు, ఎండు మిరపకాయలు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈసారి సంక్రాంతి పురుషుడు ఏ వాహనంపై వస్తాడో తెలుసుకొని అందుకు తగినట్లు ఆలయాల్లో దేవతలకు (తరువాయి 8వ పేజీలో)

లబ్ధిదారుల జాబితా రూపకల్పనకు

క్షేత్రస్థాయి పరిశీలన

• కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26 నుంచి అమల్లోకి తెస్తున్న రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ల, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి గ్రామ సభల ద్వారా అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం నుండి అదనపు కలెక్టర్లు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూరేలా చూడాలన్నారు. లబ్ధిదారుల జాబితాను రూపొందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నేటి నుంచి 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఈనెల 21 నుండి చేపట్టనున్న గ్రామ సభలలో ఆ జాబితాను ప్రవేశపెట్టి, ఆమోదం పొందిన మీదట అర్హుల జాబితాను కలెక్టర్ కార్యాలయంలో అందించాలని సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద అర్హులైన కుటుంబానికి ఏడాదికి రూ.12వేలు, మొదటి విడతగా రూ.6వేలు అందించనున్నట్లు చెప్పారు. భూమిలేని నిరుపేదలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులపాటు పనిదినాలు ఉన్న వారి వివరాలతో అర్హుల జాబితా రూపొందించాలని ఉపాధి హామీ కూలీల ఆధార్ కార్డును అనుసంధానం చేయడం జరిగిందని తెలిపారు. సాగుకు యోగ్యంగా ఉండే భూముల వివరాలతో జాబితా తయారు చేయాలని వ్యవసాయ అధికారులు రూపొందించిన జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుదారుల పూర్తి వివరాలను నమోదు చేయాలని, గ్రామీణ ప్రాంతాలలో నివసించే వారి వార్షిక ఆదాయం రూ.లక్షా 50వేలు, పట్టణ ప్రాంతాలలో నివసించే వారికి రూ.2లక్షలు మించి ఉండకూడదని తెలిపారు. రేషన్ కార్డులలో పేర్ల తొలగింపులు, కొత్త పేర్లను చేర్చడం వంటివి కూడా చేయాల్సి ఉంటుందని అన్నారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూరేలా పూర్తి పారదర్శకత, నిబద్ధతతో క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

ప్రాణాంతకంగా చైనామాంజ!

- జిల్లాలో చాలాచోట్ల చైనామాంజ బాధితులు
- నియంత్రణలో పోలీసుశాఖ శీతకన్ను
- పోలీసు బాస్ లేకే..
- సీపీ నియామకంపై చొరవ చూపని సర్కారు

ఖిల్లా, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చైనామాంజ ప్రజలపై ప్రతాపం చూపుతూ ప్రాణాంతకంగా మారింది. జిల్లాలో వరుస ఘటనలు హల్‌చల్ చేస్తున్నాయి. గాలిపటాలను ఎగురవేసే ఔత్సాహకులు చైనామాంజను జిల్లావ్యాప్తంగా వినియోగిస్తున్నారు. పోలీసులు నిషేధిత చైనామాంజను నియంత్రించడంలో దృష్టిసారించకపోవడంతో వాటి విక్రయాలు జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రజలు పతంగుల వేడుకను జరుపుకుంటారు. పండుగలో భాగమైన గాలిపటాల వేడుకలో అపస్మృతి చోటు చేసుకుంటుంది. చిన్నపాటి సంతోషం కోసం ఇతరుల గాలిపటాలపై పోటీలు పడివారి గాలిపటాన్ని తమ మాంజతో కట్ చేసి ఉత్సాహపడేవారు. అందుకోసం నాణ్యమైన, ధృడంగా ఉండే నిషేధిత చైనామాంజను వినియోగిస్తుంటారు. కానీ అదిఇతరుల మెడకు చుట్టుకుంటుందనే ఆలోచనలు లేకపోవడంతో జిల్లాలో వరుస ఘటనల్లో పలువురు వాహనదారులు గాయాలపాలయ్యారు. నిషేధిత చైనామాంజ విక్రయాలపై పోలీసుశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో దాని వినియోగం జోరందుకుంది. వెరసి చైనామాంజకు గురై కొందరు వాహనదారులు తీవ్రగాయాలపాలైన ఘటనలు జిల్లాలో జరుగుతున్నాయి. మంగళవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో బైకుపై వెళ్తున్న ప్రవీణ్ అనే వ్యక్తి మెడకు చైనామాంజ చుట్టుకోవడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. మోర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నవీన్ మరో వ్యక్తితో కలిసి కమ్మర్‌పల్లి బ్యాంకు వద్దకు రాగానే దారం తెగిన గాలిపటానికి ఉన్న చైనామాంజ బైక్ నడుపుతున్న నవీన్ మెడకు చుట్టుకుని కోసింది. అలాగే కామారెడ్డి జిల్లాకేంద్రంలో చైనామాంజ గొంతుకు తగులడంతో ఆయనకు తీవ్రగాయాలైన ఘటన చోటు చేసుకుంది. నవీపేట మండలకేంద్రంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న అద్నాన్ అనే యువకుడికి చైనామాంజ మెడకు తగిలి తీవ్ర గాయాలు అయ్యాయి.


చైనామాంజ తగిలి గాయపడ్డ నవీన్, ప్రవీణ్, అద్నాన్

• నియంత్రణలో పోలీసుశాఖ శీతకన్ను

జిల్లాలో చైనామాంజ నియంత్రణలో పోలీసుశాఖ పూర్తిగా విఫలం చెందిందని ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. పండుగ ముందు తూతూమంత్రంగా ఇద్దరు ముగ్గురు వ్యాపారస్తుల నుంచి తూతూమంత్రంగా నిషేధిత చైనామాంజను స్వాధీనం చేసుకుని కేసులు పెట్టారు. సంక్రాంతి పండుగలో భాగమైన పతంగుల వేడుకలో దృష్టిలో పెట్టుకుని జిల్లావ్యాప్తంగా వందల సంఖ్యలో పతంగుల దుకాణాలు వెలుస్తాయి. నిర్వాహకులు వివిధ రకాల మాంజా విక్రయాలు చేస్తుంఆరు. జనవరి 13, 14, 15 తేదీల్లో పండుగ సెలవులు ఉండడం వల్ల ప్రజలు గాలిపటాలను ఎగురవేసి వేడుకలు జరుపుకుంటారు. కానీ పోలీసుశాఖ వీటిని గమనించకుండా నిషేధంగా ఉన్న చైనామాంజ విక్రయాలపై దృష్టిసారించకపోవడం విడ్డూరంగా ఉంది. నగరంలోని పెద్దబజార్ రోడ్డులో యథేచ్ఛగా చైనామాంజ విక్రయాలు జరుపుతున్న అడ్డుకున్న నాథుడే కరువయ్యారు. వ్యాపారులు మాత్రం తాము తెచ్చుకున్న చైనామాంజను విక్రయించి సొమ్ము చేసుకున్నారు. పోలీసుల వైఫల్యం కారణంగా జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలో ప్రజలు ప్రమాదాలకు గురయ్యారు. పోలీసులు పండుగకు ముందే భారీ ఎత్తున పతంగుల దుకాణాలపై దాడులు చేసి చైనామాంజను పట్టుకుని ఉంటే ఇలాంటి దురదృష్ట కరమైన ఘటనలు జరిగేవి కావు. మనుషులతో (తరువాయి 8వ పేజీలో)

ఫటా..ఫట్...

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

● వెంకటేశ్వర్‌రెడ్డి ఏసీపీ ఆర్మూర్



గ్రామాల్లోగ్రామాభివృద్ధి కమిటీలు గ్రామాన్ని అభివృద్ధిపథం నడిపించాలి తప్ప ఇష్ట రాజ్యంగా వ్యవహరిస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలుతీసుకుం టాం.

ఆంధ్రజ్యోతి: సైబర్ క్రైంల పట్ల ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఏసీపీ: విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. తెలియని వారు ఫోన్ చేస్తే అప్రమత్తంగా ఉండాలి. ఎవరైన నష్టపోతే 1930నెంబర్‌కు సమాచారం ఇవ్వాలి.

ఆంధ్రజ్యోతి: వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు?

ఏసీపీ: ఇటీవల జరిగిన దొంగతనాలలో కొన్నింటిని ఛేదించి దొంగలను పట్టుకొని సొమ్మును రికవరీ చేశాం. గతంలో పెండింగ్‌లో ఉన్న కేసులను ఛేదిస్తాం. గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలి.

ఆంధ్రజ్యోతి: గంజాయి, మట్కా, పేకాట నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఏసీపీ: గంజాయి, మట్కా, పేకాటలపై ఉక్కుపాదం మోపుతాం. ప్రజలకు ఎవరికైనా తెలిస్తే 100డయల్‌కు సమాచారం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో సీసీ కెమెరాలు లేక ప్రైవేటు వ్యక్తులపై ఆధారపడాల్సి వస్తోంది?

ఏసీపీ: గతంలో పెట్టిన సీసీ కెమెరాలు కోతుల వల్ల చెడిపోయాయి. హై రెంజ్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. అలాగే దాతలు ముందుకు వచ్చి తమ గ్రామాల్లో, వీధులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

ఆంధ్రజ్యోతి: గ్రామాల్లో వీడీసీల అకృత్యాలు ఎక్కువయ్యాయి?

ఏసీపీ: వాస్తవంగా కొన్నిగ్రామాల్లో వీడీసీల అకృత్యాలు ఎక్కువయ్యాయి. చట్టాన్ని చేతిల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు చేపడతాం.వీడీసీల బారినపడి నష్టపోతే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

● (ఆంధ్రజ్యోతి, ఆర్మూర్)

కనువిందుగా కనుమ పండుగ



పశువులతో రైతులు, గ్రామ పెద్దలు

మోస్రా,జనవరి15(ఆంధ్రజ్యోతి): మోస్రా, చందూర్ మండలాల్లో బుధవారం కనుమ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కనుమ పండుగ సందర్భంగా చెరువు ప్రాంతంలో గ్రామ పెద్దల సమక్షంలో పశువులను కలిగి ఉన్న రైతులు కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పశువులకు పలు ధాన్యం గింజలను తినిపించి, పశువులకాపరులు పండుగను పాతకాలం నాటి విధంగా వంటలు చేసి కనుమ విందు భోజనం నిర్వహించారు.కనుమరుగు అవుతున్న ఈ సంప్రదాయంను రానురాను ఇలా జరుపుకోవడం అందరికి ఆనందంగా మారిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాడి పశువులు కలిగిన రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చైనా మాంజ తగిలి ఇరువురికి గాయాలు

కమ్మర్‌పల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చైనా మాంజ దారం కమ్మర్‌పల్లిలో మరోవ్యక్తి ప్రాణలమీదకు తెచ్చింది. పోలీసులు వద్దు వదంటున్నా పెడచెవిన పెడుతున్న వ్యాపారులు ధనార్జనేధ్యేయంగా అధిక ధరలకు చైనా మాంజ దారాలు విక్రయిస్తూ పోలీసులకే సవాల్‌గా మారారు. కమ్మర్‌పల్లిలో వరుసగా రెండు సంఘటనలు చోటు చేసుకున్నాయి.మంగళవారం సంక్రాంతి పర్వదినరోజు మధ్యాహ్నం గ్రామానికి చెందిన డబ్బా రఘు బాలుడి మెడకు చైనా మాంజ చుట్టుకుని తీవ్రగామయింది.కాగాబుధవారం మధ్యాహ్నం మో ర్తాడ్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గు జ్జేటి ప్రవీన్ మరో వ్యక్తితో కలిసి బైక్‌పై మెట్‌పల్లి వెళ్లి తిరుగు ప్రయాణంలో కమ్మర్‌పల్లి ఆంధ్రబ్యాంక్ వద్ద జాతీయరహదారిపై చైనామాంజా మెడకు చుట్టుకుని తీవ్రగాయాలయ్యాయి.విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు గాలిపటాలు ఎగురవేస్తున్న పలువురి నుంచి మాంజ చర్కాలను లాక్కొని వెళ్లారు.కాగా బుధవారం స్థానిక ఎస్సీ కాలనీలో కొందరు యువకులు గాలిపటాలు ఎగురవేస్తుండగా కాల నీ యువకులు వారివద్దనుండి మాంజ,చర్కాలను లాక్కొని వారిసమక్షంలోనే దహనం చేస్తూ సాధారణ దారాతోనే గాలిపటాలు ఎగురవేసుకోవాలని సూచించారు.

నవీపేటలో

నవీపేట: మండల కేంద్రంలోని రైల్వే గేటు సమీపంలో మంగళవారం చైనా మాంజ తగిలి యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం మంగళవారం బైక్‌పై ఇంటి నుంచి వెల్డింగ్ షాపుకు వెళ్తుండగా దుకాణం సమీపంలో తెగిన గాలిపటానికి చెందిన చైనా మాంజా మెడ, చేతి వేళ్లు, కాళ్లకు చుట్టుకుంది. దీంతో బైక్‌పై ఉన్న అద్నాన్ వెంటనే కింద పడిపోగా అతనిని మెడ, రెండు చేతి వేళ్లు తెగి తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే అతనిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు

తొమ్మిది మంది పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్,జనవరి15(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంకాపూర్ గ్రామశివారులో టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం తొమ్మిది మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. తెలిసిన సమాచారం మేరకు పేకాట స్థావ రంపై దాడి చేసి తొమ్మిది మంది పేకాటరాయుళ్లతో పాటు రూ.22వేల 750నగదు, తొమ్మిది సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రుద్రూర్: మండల కేంద్రంలోని చెరువు కట్ట శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడు తున్న తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,800 స్వాధీనపరుచుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న వెల్లడించారు.

మనస్థాపానికి గురై మహిళ ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, జనవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సాపల్లి గ్రామశివారులో చల్ల సీనమ్మ(45) అనే మహిళ బుధవారం మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం భార్యభర్తల మధ్య గొడవ జరగగా ఇస్సాపల్లి గ్రామశివారులోని ఇటుక బట్టి వద్ద పని చేస్తున్న సీనమ్మ గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం

ముప్కాల్, జనవరి15(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామానికి చెందిన పాకనాటి లక్ష్మీ అనే వృద్దురాలు ఈనెల 12వ తేదీన ఉదయం ఎవరికి చెప్పకుండా బయటకువెళ్ళి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్ళలో వెతికిన ఆచూకి లభించలేదు. ఎవరికైనా తెలిస్తే సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు. కొడుకు పాకనాటి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



పాలు పొంగిస్తున్న రైతులు



గాలి పటాలు ఎగురవేస్తున్న చిన్నారులు



ఆర్మూర్ సంక్రాంతి వేడుకల్లో వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు



ఆర్మూర్‌లో విజేతకు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

మద్నూర్,జనవరి 15(ఆంధ్రజ్యోతి): మూడు రోజులపాటు జరిగిన సంక్రాంతి వేడుకలు ఉమ్మడి మద్నూర్ మండలంలో ఘనంగా సంబురంగా జరుపుకున్నారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన ఉత్తరాయణ పుణ్యకాలాన్ని మకర సంక్రాంతిగా పాటించారు. సూర్యుడు దక్షిణం నుంచి ఉత్తమ వైపు తిరగడమే దీని ప్రత్యేకత. భోగి భోగ భాగ్యాలకు, సంక్రాంతి సంపదకు, కనుమ కలిమికి చిహ్నముగా చెప్పే మూడు రోజుల పండుగ సోమవారం నుంచి బుధవారం వరకు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం మకర సంక్రాంతి సంక్రమణం లక్ష్మీదేవి ఆగమనానికి సంకేతంగా రైతులు తమ జొన్న చేలల్లో జొన్న కర్రలతో గుడిని ఏర్పాటు చేసి అందులో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడికి ఎదురుగా పిడకలతో మంటను తయారుచేసి దానిపై కొత్త కుండలో పాలు పొంగించి సంబరాలు జరుపుకున్నారు.జొన్నచేల్లలో తమ ఇరుగు పొరుగువారు స్నేహితులతో పాటు బంధువులతో వనభోజనాలు చేసుకున్నారు. సాయంత్రం నువ్వులు బెల్లంతో కలిపిన పదార్థాన్ని ఇంటింటికి పంచుతూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నారులు సాయంత్రం గాలిపటాలతో సందడి చేశారు. చివరి రోజైన బుధవారం కనుమ పండుగ జరుపు కున్నారు. మూరోజు కనుమతో, సంక్రాంతి సంబురాల పండుగ ముగిసింది.

కమ్మర్‌పల్లి: సంక్రాతి పర్వదినాన్ని పేరస్కరించుకుని మంగళవారం స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆకర్షనీయంగా నిలిచిన ముగ్గులను ఎంపిక చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో న్యాయనియనిర్ణేతగా కవి రచిత్రి మగ్గిడి లక్ష్మి,వీడీసీ అధ్యక్షుడు బోగ రామస్వామి, కోశాధికారి బుచ్చిమల్లయ్య, బెజగం గంగాధర్, కమిటీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లో ఆయా గ్రామాల్లో మకర సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు చేసిన పిండి వంటలు ఘుమఘుమలాడాయి. ఉదయం నుంచి సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి బొబ్బెమ్మలు పెట్టారు. సంక్రాంతి పండగ సందర్భంగా మహిళలు నోములు ఇచ్చి పుచ్చుకున్నారు. యువకులు గాలిపటాలు ఎగురవేస్తూ ఉత్సాహంగా గడిపారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో రెండు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులతో వాకిళ్లను అలంకరించారు. పిండి వంటలు చేసుకుని ఆరగించారు. పలువురు రైతులు పంట పొలాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం కనుమ పండుగను ఉత్సహంగా జరుపుకున్నారు. విందు, వినోదాలతో సంతోషంగా గడిపారు.

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లో మంగళవారం ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్‌ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

వర్ని: వర్ని మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. భోగి, సంక్రాంతి, కనుమ వేడుకల్లో ప్రజలు సంబరంగా పాల్గొన్నారు. పతంగులను పోటాపోటీగా ఎగురవేశారు.

వేల్పూర్: మండలంలోని ఆయాగ్రామాల్లో సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకున్నారు.గతరెండు రోజులుగా మహిళలు ఇంటి వాకిళ్ళ ముందు రంగురంగుల ముగ్గులు వేశారు.ఇంట్లో పలు రకాల పిండి వంటలను చేశారు.ఈ సందర్భంగా పడిగెలలో వీరహన్మాన్ గల్లీలో రవీందర్‌యాదవ్ వంద మంది పిల్లలకు సంక్రాంతి పండగ సందర్భంగా గాలిపటాలను పంపిణీ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు రాజరపు సుమన్, అన్వేష్, రాకేష్, భరత్, శ్రీకార్,రోషణ్, నరేష్, రాగి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: పట్టణంలో సంక్రాంతి వేడుకలు పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రజలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.సంక్రాంతి పండగ సందర్భంగా మహిళలు నోములు ఇచ్చి పుచ్చుకున్నారు. యువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ ఉత్సాహంగా గడిపారు.

ఆర్మూర్‌రూరల్: మహిళలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని పటణంలోని హస్నాబాద్‌కాలనీలో త్రిపుర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ఎమ్మెల్యే పాల్గొని మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి ఉత్తమంగా నిలిచిన ముగ్గులకు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మహిళలకు షీల్డ్, మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ అధ్యక్షుడు కొట్టాల సుమన్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, బీజేపీ నాయకులు ఆకుల శ్రీనివాస్, సుంకరి రంగన్న, ఆకుల రాజు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని 4వార్డులో మకర సంక్రాంతి పండగను పురస్కరించుకొని వైస్‌చైర్మన్ గున్నాల బాలభగత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలో జిలకర వైష్ణవి, మొదటి స్థానంలో నిలవగా వైస్‌చైర్మన్ భరత్, బీఆర్‌ఎస్ నాయకులు మల్లెల ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పల్లెర్ల అశోక్, శ్రీనివాస్, బంటి రాకేష్, పి.శ్రీనివాస్, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

సీపీ కార్యాలయానికి భీమ్‌గల్ సీఐ అటాచ్

భీమ్‌గల్, జనవరి15(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ సీఐ నవీన్‌ను ఉన్నతాధికారులు సీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది జూన్ 26న బాధ్యతలు చేపట్టిన సీఐ ఒక సివిల్ పంచాయతీలో తనపై దాడి చేసేందుకు నిందితులకు అండగా నిలిచి ఒక మధ్యవర్తి ద్వారా డబ్బులు తీసుకొని తనకు న్యాయం చేయలేదని బాధితుడు ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆర్మూర్ ఏసీపీతో విచారణ చేపట్టిన అధికారులు సీఐను సీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతాధికారులు పూర్తి విచారణ అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్టు సమాచారం.

● ఆరు నెలల్లో ఇద్దరు సీఐలపై వేటు..

శాంతి భద్రతల పరిక్షణకు ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తుంటే ఇక్కడ మాత్రం అవేమి పట్టనట్టు సీఐ, ఎస్సైలు పలు సివిల్ కేసుల్లో తలదూర్చుతూ వివాదాస్పదమవుతున్నారు. గడిచిన ఆరు నెలల కాలంలో ఇద్దరు సీఐలు అవినీతి ఆరోపణాలతో వారిపై వేటు పడింది. గత ఏడాది జనవరి 25న సీఐగా బాధ్యతలు

● పలు కేసుల్లో అవినీతి ఆరోపణలు



భీమ్‌గల్ సీఐ నవీన్

చేపట్టిన నాగాపూరి శ్రీనివాస్ ఇసుక విషయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొని ఇదే సంవత్సరం జూన్ 26న బదిలీపై వెళ్లారు. మెట్‌పల్లి సీఐగా పనిచేస్తున్న నవీన్ భీమ్‌గల్‌కు బదిలీపై వచ్చి జూన్ 26 బాధ్యతలు చేపట్టి ఏడు నెలల కాలంలోనే అవినీతి ఆరోపణలతో వేటు పడడంతో చర్చనీయాంశ మైంది. డిసెంబరు 2న తాను ఉంటున్న ప్రదేశాన్ని ట్రెస్ చేసి తనపై దాడికి కారణం అయ్యాడని ఇదే విషయమై న్యాయం కోసం వెళ్ళితే మధ్యవర్తి ద్వారా డబ్బులు తీసుకున్నాడని, మరో కేసులో ఒక దళిత మహిళపై దాడి కేసును నీరుగార్చాడని సమాచారం.ఇందుకు పైరవీకారులు కూడా సహయ సహకా రాలు అందిస్తున్నారు. దీనిని బట్టి భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో పైరవీలు జోరుగు సాగుతున్నాయని పలువురు బాహటంగానే చర్చించుకుంటు న్నారు. ఇదీలా ఉండగా భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ లో పని చేస్తున్న మరో అధికారి పై కూడా ఉన్నతాధికారులు విచారణ కొనసాగుతున్నట్టు సమాచారం.

బుస్సాపూర్‌లో ఒకరి దారుణహత్య

● పండుగ పూట విషాదచాయలు



దిలీప్‌శర్మ (ఫైల్)

మెండోర, జనవరి15(ఆంధ్రజ్యోతి):మండలంలో బుస్సాపూర్ గ్రామంలో దిలీప్ శర్మ(36) హత్యకు గురైనట్టు ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివ రాల ప్రకారం మృతుడు మహారాష్ట్ర బడపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిని పవన్ క్లీనిక్‌లో గతపదేళ్లుగా కంపౌండర్ పనిచేస్తూ కుటుంబ సభ్యులతో క్లీనిక్ వెనకాలే నివాసం ఉంటున్నాడని మృతుడి భార్య ఇద్దరి పిల్లలతో వారి స్వగ్రామం మహారాష్ట్ర బడాపూర్ సంక్రాంతి పండగకు వెళ్లడం జరిగింది. మంగళవారం ఉద యం పవన్ క్లీనిక్ డాక్టర్ ప్రకాష్ ఆసుపత్రికి చేరుకోగానే గేటుకు తాళంవేసి ఉండడంతో వెనుకాలే దిలీప్ శర్మ ఇంటికి తాళం వేసి ఉండడంతో చెప్పులు, బండరాళ్లు బయట కనబడడం అనుమానం వచ్చి ఆసుపత్రి సిబ్బందితో తాళం పగులగొట్ట చూడగా రక్తం మడుగులో దిలిప్‌శర్మ ఉండడంతో పోలీసులకు సమాచారం అందిం చారు. ఇంట్లో ఎవరూ లేని విషయం తెలుసుకున్న గుర్తుతెలియని వ్యక్తులు దిలిప్‌శర్మను హత్య చేశారని తెలిపారు. హత్య జరిగిన ప్రాంతాన్ని డాగస్క్వాడ్ సిబ్బంది పరిశీలించారు. సంఘటన స్థలాన్ని ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్మూర్ రూరల్, టౌన్ సీఐలు శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణలు పరిశీలించారు. పోలీసులు బృందాలతో హంతకులను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. మృతుడి భార్య సాగరిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బైక్ దొంగతనం చేసిన నిందితుడి అరెస్టు

జక్రాన్‌పల్లి, జనవరి15(ఆంధ్రజ్యోతి): బైక్‌ను దొంగతనం చేసిన కేసులో దోమకొండకు చెందిన పల్లపు రమేష్‌ను అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు పంపినట్టు ఎస్సై సీహెచ్.తిరుపత తెలిపారు. కామారెడ్డి జిల్లా దోమకొండకు చెందిన పల్లపు రమేష్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు. ఎస్సై సీహెచ్.తిరపతి తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామపరిధిలో గాంధీనగర్‌కు చెందిన రాయికంటి గంగాధర్ తన ఈనెల 11న తన ఇంటి వద్ద ప్యాషన్ ప్రో బైక్‌ను ఇంటి వద్ద ఉంచగా అదే రోజు రాత్రి బైక్ పోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా బుధవారం బైక్ దొంగతనం చేసిన నిందితుడు పల్లపు రమేష్ కామారెడ్డిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకొని విచారించగా తాను బైక్‌ను దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నాడని, చోరీ చేసిన బైక్‌ను రికవరీ చేసి నిందితుడు పల్లపు రమేష్‌ను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

హంగర్గలో ఘనంగా గంగమ్మ పండుగ

కోటగిరి,జనవరి15(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలం హంగర్గ గ్రామంలోని మంజీర నదిలో బుధవారం గంగమ్మ తల్లి పండుగలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు శ్రీ చైతన్య మహరాజ్ ముఖ్య అతిథిగా హాజరైన భక్తులకు ప్రవచనలు వినిపించారు. ప్రతిఏటా కనుమ పండుగ రోజు గంగమ్మ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుంది. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

బోధన్‌రూరల్,జనవరి15(ఆంధ్రజ్యోతి):ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నియమ,నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అన్నారు.బుధవారం కొత్త బస్టాండ్,పాతబస్టాండ్‌లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి వాహనదారులను ఎక్కించుకోవద్దని సూచించారు.కొత్త చట్టాలు అమలులో ఉన్నాయని, ప్రతీఒక్కరు నియమ, నిబంధనలను పాటించాలన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు

బోధన్‌రూరల్,జనవరి15(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో బుధవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు అశోక్‌రావు కులకర్ణితో పాటు ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

● ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు అర్థరహితం : నియోజకవర్గ నాయకుల విమర్శ

వర్ని,జనవరి15(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత బాన్సువాడ పర్యటనలో కాంగ్రెస్ పార్టీపై అసత్య ఆరోపణలు చేయడం సిగ్గు చేటని ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రావు విమర్శించారు. బుధవారం వర్ని మండల కేంద్రంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది పాలనో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాని స్పష్టం చేశారు. మద్యం పాలసీ, అమ్మకాలు, అక్రమంగా సంపదనప జైలుకు వెళ్లి వచ్చిన చరిత్ర కవితని ఆరోపించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని దగ్గర చేసుకునేందుకు ఆయనపై విమర్శలు చేయకపోవడం వెనుక ఎమ్మెల్సీ కవిత అంతర్యమేమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్సీగా గౌరవాన్ని కాపాడుకోవాలి తప్ప అధికారం పోయిందని రేవంత్ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ మండలల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలి

● ఆర్మూర్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి వేముల దీప్తి



ఇస్సాపల్లిలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న వేముల దీప్తి

ఆర్మూర్‌రూరల్, జనవరి15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలను కాపాడడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని ఆర్మూర్ ప్రిన్సిపాల్ జూనియర్ న్యాయాధికారి వేముల దీప్తి అన్నారు. బుధవారం ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జూనియర్ సివిల్ న్యాయాధికారి వేముల దీప్తి, విశిష్ట అతిథిగా అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి సరళరాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలను పెంపొందించడానికి గ్రామస్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయన్నారు. ఈఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సీఏ రాజశేఖర్‌ను వారు అభినందించారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు అర్గుల్ సురేష్, సడాక్ ప్రమోద్, రాజ్‌కుమార్, అమితాబ్ కిరాడ్, లక్ష్మణ్, గంగామోహన్, దుర్గ శీను, సునంద, చిన్నయ్య, ధనుంజయ్, దశరథ్, ఆలయ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, వీడీసీ అధ్యక్షుడు కొర్వ పున్నం, బండి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో సర్వే

నవీపేట,జనవరి15(ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులకు రైతు భరోసా పథకం అందించాలనే లక్ష్యంతో గురువారం నుండి ఈ నెల 20వరకు గ్రామాలలో సర్వే చేపట్టడం జరుగుతుందని ఏవో నవీన్ కుమార్ తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాలలో అధికారులు సర్వే చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ డివిజన్‌లోని అన్ని మండలాల్లో గ్రామాలలో అర్హులైన రైతులకు రైతు భరోసా పథకం అందించాలనే లక్ష్యంతో గురువారం నుండి ఈ నెల 20వ తేది వరకు గ్రామాలలో సర్వే చేపట్టడం జరుగుతుందని తహసీల్దార్ విఠల్ తెలిపారు.

మోర్తాడ్: మండలంలోని వివిధ గ్రామాలలో గురువారం నుంచి సాగుకు యోగ్యం కాని భూముల సర్వే చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి హరిష్‌కుమార్ తెలిపారు. ఈనెల 16న దొన్కల్, వడ్యాట్, పాలెం గ్రామాలలో భూముల సర్వే జరుగుతుందని, ధర్మోరా, దొన్‌పాల్, మోర్తాడ్, శెట్‌పల్లి, సుంకెట్, తిమ్మాపూర్ గ్రామాలలో భూముల సర్వే జరుగుతుందని రైతులు సర్వేలో పాల్గొన్న అధికారులకు సహకరించాలని ఏవో కోరారు.

ముప్కాల్: మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్పెషల్ ఆఫీసర్ స్రవంతి ఆధ్వర్యంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సర్వేలో తహసీల్దార్ కృష్ణ, మండల వ్యవసాయాధికారి సాయికృష్ణనయాబ్‌తహసీల్దార్,ఎంపీవో ఉన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

నవీపేట,జనవరి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాడాపూర్‌కు చెందిన జ్ఞానేశ్వర్ అనే 16సంవత్సరాల బాలుడు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. ఈ నెల 10న రాత్రి మండలంలోని జన్నేపల్లిలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న షేక్.కామబీ అనే 66 సంవత్సరాల వృద్ధురాలిని బైక్ ఢీకొనడంతో ఆమె చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో బైక్ నడిపిన జ్ఞానేశ్వర్ సైతం తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు.

పసుపుబోర్డు ఏర్పాటు హర్షనీయం

● మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ



మోర్తాడ్‌లో మోదీ, పీయుష్ గోయల్, అర్వింద్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



ఏర్గట్లలో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌రూరల్, జనవరి15(ఆంధ్రజ్యోతి):జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేయడం హర్షనీయమని మాజీఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతుల చిరకాల వాంఛ నెరవేర్చడానికి ఎంపీ ధర్మపురి అర్వింద్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. రైతాంగం జిల్లాకు పసుపుబోర్డు రాదనుకున్న తరుణంలో ఎంపీ పట్టుదలతో ప్రయత్నించి రైతుల దశబ్దాల కోరికను నెరవేర్చారన్నారు. గత ఎన్నికల్లో జిల్లా రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు ఎంపీ ధర్మపురి అర్వింద్ గత కొన్నేళ్లుగా తీవ్రంగా శ్రమించి పసుపు బోర్డు సాధించారన్నారు. పసుపుబోర్డును తమ రాష్ట్రాలకు తీసుకువెళ్లడానికి పలు రాష్ట్రాలు ఎంతో ప్రయత్నిం చేసినప్పటికీ జిల్లాకు పసుపుబోర్డు రావడానికి పట్టుదలతో ఎంపీ శ్రమించారన్నారు. జిల్లాకు పసుపుబోర్డు రావడానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కృషి కూడా ఎంతో ఉందని అన్నపూర్ణమ్మ అన్నారు. ఎంపీ అర్వింద్ పట్ల జిల్లా ప్రజలకు నమ్మకం కుదిరిందని, సమర్థవంత నాయకుడని తెలిసిందన్నారు. పసుపుబోర్డు సాధన ఎన్నికల స్టాంట్ అని, ప్రచారం చేసిన ప్రతిపక్షాలు ఇప్పుడు ఏమంటారని ఆమె ప్రశ్నించారు. పనిచేసే ప్రభుత్వాన్ని బీజేపీ నాయకుల మాటలను రైతులు నమ్ముతున్నారన్నారు.రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్ష పార్టీల నాయకులు ఎంపీ అర్వింద్‌ను అభినందించారని, లేని పక్షంలో రైతులవిశ్వాసాన్ని కోల్పోతారని మాజీఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ అన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలో మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వం పసుపుబోర్డు ప్రకటించిన సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి పీయుష్‌గోయాల్,ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రప టాలకు బీజేపీ నాయకులు పాలాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు పుప్పాల నరేష్ మాట్లాడుతూ భారతీ య జనతా పార్టీ చెప్పింది చేస్తాదని, చేసేదే చెబుతాదని దానికి నిదర్శనం పసుపుబోర్డు అని అన్నారు.నాలుగు దశాబ్దాల రైతుల చిరకాలవాంచ నెరవేరిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్, బీజేపీ నాయకు లు జైడి గంగారెడ్డి, కుంట శ్రీనివాస్‌రెడ్డి, తీగెల రమేష్‌రెడ్డి, గంగారాం, సంగెం అనిల్, ప్రకాష్, ఏలేటి గంగారెడ్డి, మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: పసుపు బోర్డు ఏర్పాటుపై మండలంలోని బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ప్రధానమంత్రి మోదీ, ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రైతులు పసుపు బోర్డు ఏర్పాటు కో సం ఉద్యమాలు చేశారని, ఎంపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డు రావడమే కాకా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం దానికి పల్లె గంగారెడ్డిని చైర్మన్‌గా నియమించడం పట్ల ఎంపికి కృతజ్ఞతలు తెలుపుతు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఏలేటి నారాయణరెడ్డి, సోమ రాజారెడ్డి, సురేష్, ప్రశాంత్, ఆనందం గంగేశ్వర్, విఠల్‌లు పాల్గొన్నారు.

● పసుపు బోర్డు ఏర్పాటుపై బీజేపీ నాయకుల హర్షం

జక్రాన్‌పల్లి: జిల్లాలో పసుపుబోర్డు ఏర్పాటు చేసి సందర్భ ంగా, అలాగే జాతీయ పసుపుబోర్డుచైర్మన్‌గా పల్లెగంగారెడ్డిని నియమించి నందున బుధవారం జక్రాన్‌పల్లిలో ప్రధాని నరేంద్రమోదీ, ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు బీజేపీనాయకులు క్షీరాభిషేకం చేశారు. ఎంపీ అర్వింద్ చిత్రపటాలతో పా టు జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి చిత్రపటాలకు బీజేపీ నాయకులు క్షీరా భిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌మోర్చ జిల్లా పి.తిరుపతిరెడ్డి, మం డల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్; మండల బీజేపీ నాయకులు శ్రీని వాస్‌రెడ్డి, క్యాతం రాజారెడ్డి, నవీన్,విక్రం,చందు, కార్తిక్, మోహన్‌నాయక్, శ్రీకాంత్, పాల్గొన్నారు.


నవీపేటలో అయ్యప్ప స్వామి ఆభరణాలు పెట్టెను ఎత్తుకున్న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప ఆభరణాల ఊరేగింపు

● పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే

నవీపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయం నుంచి స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వరకు మంగళవారం శ్రీ అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మకర సంక్రాంతిని పురస్కరించుకుని అయ్యప్ప స్వామికి చెందిన ఆభరణాల పెట్టెను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ భక్తితో తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నిధులున్నా ముందుకు సాగని పనులు

● ధ్వంసమైన ఉప్లూర్ - డబ్బా గ్రామాల రహదారి ● రాకపోకలకు తీవ్ర ఇబ్బంది

కమ్మర్‌పల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, జగిత్యాల జిల్లాలకు వారధిగా ఉపయోగపడే ఉప్లూర్ నుంచి డబ్బా, వర్దకొండా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిస్థాయిలో దంసమై రెండు గ్రామాల ప్రజలతో పాటు ఈ ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులకు, చివరకు శ్మశానవాటికలోకి వెళ్లేందుకు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమవ్వడంతో అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఉప్లూర్ గ్రామం నుంచి డబ్బా వరకు (నిజామాబాద్ జిల్లా సరిహద్దు వరకు) బీటీ రోడ్డు రెనివల్ నిమిత్తం పంచాయతీరాజ్ శాఖ నుంచి ఎంఆర్ ఆర్ 2022 జీవో ప్రకారం కోటి 45 లక్షల వ్యయంతో పనులు చేపట్టే నిమిత్తం నిధులు మంజూరు చేయించి 2 అక్టోబర్ 2023లో శంకుస్థాపన చేశారు. దీంతో తమ తిప్పలు తీరిపోయినట్లేనని సంబురపడిపోయిన ఇరు గ్రామాల ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేశారు, కాని ఎన్నికలు రావడం బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ పనులకు గ్రహణం పట్టుకుంది. ఇప్పటికి పనులు ప్రారంభం కాకపోవడంతో ఈ నిధులు ఉన్నాయా వెనక్కి మళ్లాయా అన్న విషయం తెలియక ప్రజలు తికమకపడిపోతున్నారు. గతంలో వేసిన బీటీ రోడ్డు పెచ్చులూడిపోయి కంకర తేలింది. కనీసం ఈ రోడ్డుపై నడవడం కష్టంగా మారిందని ఈ ప్రాంత రైతులు, ఇరు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఉప్లూర్ గ్రామ సరిహద్దు సమీపంలోని గొజొర్లె వద్ద రహదారి మరీ దారుణంగా మారింది. ఈ ప్రాంతంలోని కొత్త కుంట నీరు వెళ్లడానికి ఒక బ్రిడ్జి నిర్మించారు కాని ఈ బ్రిడ్జి అసంపూర్తి పనులతో ఈ ప్రాంత రైతులను, రహదారి గుండా డబ్బా గ్రామానికి వెళ్లే ప్రయాణికులను భయభ్రాంతులకు, భయాందోళనలకు గురి చేస్తుంది. బ్రిడ్జి దాటి వెళ్లేందుకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగించాల్సిన, పరిస్థితి నెలకొంది. అర్ధాంతరంగా పనులు నిలిచి పోవడంతో ఈ దారిగుండ ప్రయాణాలు ప్రాణసంకటంగా మారాయి. డబ్బా గ్రామం ఉప్లూర్ గ్రామానికి కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండడంతో ఈ గ్రామస్థులు తమ నిత్యక్రవహనాలపై ఈ రహదారి గుండానే ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఇరుగ్రామాల ప్రజలకు, ఈ ప్రాంత రైతులకు వారధిగా నిలుస్తున్నస్తున్న ఉప్లూర్ డబ్బా గ్రామాలను కలుపుతు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ రహదారి మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు. ప్రభుత్వం మారడంతో పాత, ప్రారంభం కాని పనుల నిధులు మల్లిపోయాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే నిజమైతే ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు నాయకులు ప్రభుత్వ అధికారులు తిరిగి నిధులు మంజూరు చేయించి అసంపూర్తిగా ఉన్న రోడ్డు, బ్రిడ్జి పనులు పూర్తి చేయించి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.


కంకర తేలి మట్టి రోడ్డును తలపిస్తున్న ఉప్లూర్ - డబ్బా రోడ్డు

జర దేఖో!!


అసంపూర్తి పనులతో వెక్కిరిస్తున్న ఉప్లూర్ డబ్బా గ్రామాల మధ్య బ్రిడ్జి


బ్రిడ్జి వద్ద రహదారిపై ప్రమాద ఘంటికలు

సమాజ మార్పు కోసం యువత కృషి చేయాలి

● ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నర్సయ్య

సిరికొండ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనటంతో సమాజ మార్పు కోసం నేటి యువతరం కృషి చేయాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నర్సయ్య కోరారు. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో అమర వీరుల స్మారకార్థం జిల్లా వాలీబాల్, కబడ్డీ క్రీడల పోటీలను గుమ్మడి నర్సయ్య బుధవారం ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ యువతను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. సమాజాభివృద్ధికి, దేశాభివృద్ధికి కృషి చేయాల్సిన యువతకు మాదక ద్రవ్యాలను, మద్యాన్ని, గంజాయిని అలవాటు చేస్తున్నాయని ఆరోపించారు. యువకులు తమకోసం, తమ కుటుంబం కోసం మాత్రమే ఆలోచించకుండా సమాజ మార్పు కోసం బాధ్యతతో పనిచేయాలని ఆయన కోరారు. గడ్కోల్‌లో అమరుల కోసం క్రీడల్ని నిర్వహించడమంటే వారి ఆశయాల సాధన కోసం పోరాడడమేనన్నారు. మత్తు పదార్థాలకు, మద్యాన్ని వదిలి ప్రగతిశీల ఉద్యమాల వైపు వెళ్లాలని మాజీ ఎమ్మెల్యే నేటి యువకులను కోరారు. అంతిమంగా దోపిడీకి వ్యతిరేకంగా పోరాడినప్పుడే మన బతుకులు మారుతాయని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య యువతకు సూచించారు. అంతకు ముందు గ్రామంలో గల భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వేదిక మీద అమర వీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర నాయకులు విప్లవకుమార్, రామక్రిష్ణ, దేవరాం, డివిజన్ కార్యదర్శి రమేష్, నాయకులు దామోదర్, బాబన్న, వీడీసీ సభ్యులు జిల్లా అధ్యక్షులు గోదావరి, లింబన్న, రాంజీ, కిషోర్, సాయిరెడ్డి, రమేష్, నారాగౌడ్, రమా, పుష్పలత, ఎస్. కిషోర్, అనిష్, ఆశిష్, టీచర్స్ యూనియన్ నాయకులు మోజీరాం, నరేందర్, శ్రీనివాస్, బాలయ్య, సోమన్న, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మల్లేష్ గౌడ్, పీడీలు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీలో తలపడుతున్న ముప్కాల్‌నగర్ - పందిమడుగు జట్టు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

సమస్యలు ఏవైనా ఒక్క ఫోన్ కాల్‌తో పరిష్కారం

మద్నూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సమస్యలు ఏవైనా ఒక ఫోన్ కాల్‌తో పరిష్కారం లభిస్తుంది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. వైద్యం, అగ్ని ప్రమాదం, వేధింపులు, రవాణా సౌకర్యం, భద్రత తదితర సమస్యల నుంచి తక్షణ ఉపశమనం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రకాల టోల్ ఫ్రీ నెంబర్లను అందుబాటులో ఉంచాయి.

● అంబులెన్స్ సేవలకు 108

అత్యవసర వైద్యం బాధితులకు ఆసుపత్రులకు తరలించేందుకు 108 అంబులెన్స్‌లోని వైద్య సిబ్బంది బాధితులకు ప్రాథమిక చికిత్సలు అందజేస్తారు. దీంతో రోడ్డు తదితర బాధితులకు వెంటనే ప్రాథమిక చికిత్స అందడంతో పాటు మెరుగైన వైద్య సేవల కోసం ఇతర ఆసుపత్రులకు సకాలంలో చేరవేసే అవకాశం ఉండటంతో ప్రాణాలు మిగిలే అవకాశం ఉంటాయి.

● అగ్ని ప్రమాదం జరిగితే 101

అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. అదే సమయంలో అగ్ని మాపక శాఖకు సమాచారం ఇచ్చేందుకు ఫైర్ స్టేషన్ నెంబర్ తెలుసుకునేందుకు ఇబ్బందులు పడుతుంటారు. అగ్ని ప్రమాదాల సమాచారాన్ని చేర వేసేందుకు శాఖ 101 టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. టోల్ ఫ్రీ నెంబర్‌కుకాల్ చేసిన వెంటనే సమీపంలోని అగ్ని మాపక శాఖకు సమాచారం వెళుతుంది. ఆ వెంటనే ప్రమాదం జరిగిన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుంది.

● పోలీసు సాయం కోసం 101

శాంతి భద్రతల సమస్యలతో పాటు దొంగలు వచ్చిన, రోడ్డుపై ప్రమాదం జరిగినా, ఏదైనా వివక్షత పరిస్థితులు ఎదురైన వెంటనే 100కు డయల్ చేస్తే సమీప పోలీస్‌స్టేషన్ నుంచి పోలీసులు సకాలంలో చేరుకొని ఆదుకుంటారు. ఓ సర్వే ప్రకారం 100 నెంబర్‌కు అత్యధిక కాల్స్ వచ్చినట్లు తేలింది.



ప్రజలకు అందుబాటులో 108 అంబులెన్స్

● తపాల సేవలకు

18001805232

తపాల శాఖకు సంబంధించిన సేవలు సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా పరిష్కారం లభిస్తుంది. నూతన ఖాతాలు పొదుపు నిలువలు బీమా నూతన పథకాలు తదితర సేవలన్నీ తెలుసుకోవచ్చని తపాల శాఖ అధికారులు అంటున్నారు.

● గర్భిణీల కోసం 102

రవాణా సదుపాయం తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలకు అత్యవసర సమయంలో ఆసుపత్రులకు తరలించడానికి 102 ఉపయోగపడుతుంది. అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్లి కాన్పు అయిన తరువాత తిరిగి ఇంటి వద్ద దింపే సౌకర్యం ఈ అంబులెన్స్ ద్వారా పొందవచ్చు. అదే విధంగా ఓటరు నమోదు కోసం 1950, ఉపాధి హామీ కోసం 18002 0014455, కిసాన్ కాల్ సెంటర్ కోసం 1800 1801551 వలు విధాలైన సమస్యల పరిష్కారానికి ఒక ఫోన్ కాల్‌తో పరిష్కారం లభిస్తున్నట్లు బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అమానవీయ ఘటనలు

● చికిత్స పొందుతున్న అభాగ్యులు ● పట్టించుకోని ఆస్పత్రి సిబ్బంది




ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధులు

మిర్యా, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో అమానవీయ ఘటనలు వెలుగు చూస్తున్నాయి. చికిత్స కోసం వచ్చిన అనాథ వృద్ధులను దికిక్కు నోచుకోకుండా పడిగాపులు కాస్తున్నారు. అపరిశుభ్రమైన కూలడానికి సిద్ధంగా ఉన్న ఇంటిలో దీనావస్థలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. పేరుకే పెద్దాస్పత్రి కాని అందులో ఉన్న వసతులను చూస్తే అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఉందీ పరిస్థితి. జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో ఏర్పాటు చేసిన జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఆనాథలకు చికిత్సలు అందించడానికి సిబ్బంది ముందుకు రావడం లేదనేది తెలుస్తుంది. ఆస్పత్రికి వచ్చిన వారికి కొందరికి చికిత్స అందించడానికి సిబ్బంది ససేమిరా అంటున్న ఘటనలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. రెండేళ్లుగా చికిత్స కోసం ఆస్పత్రిలో ఉన్న వృద్ధుల్లో కొందరు మృతి చెందగా మరి కొందరు చికిత్సలు అందక అవస్థలు పడుతున్నారు. చికిత్స పొందలేక, తినడానికి తిండి లేక నానా అవస్థలు పడుతు మంచాలకే పరిమిత మవుతున్నారు. వీరికి ఏమి జరిగినా గట్టిగా అరచిన వారి అరుపులు అందుకోలేని దూరంగా వీరు ఉంటున్నారంటే ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం ఎంత ఉందో అర్ధమవుతుంది. వీరంతా లావారిస్ వార్డులో నరకయాతన పడుతూ జీ వితం వెల్లదీస్తున్నారు. ఇక్కడ ఉన్నవారు ఎవరు, ఎక్కడి వారు వీరికి ఎవరు ఇక్కడ వదిలి పెట్టారు ఎవరికీ తెలియదు. వీరిని ఇంత కాలం ఎందుకు వదిలి పెట్టారు. వీరి రోదన అరణ్య రోదనగానే మిగిలిపోవాలా.. వీరికి చికిత్స చేసే నాధుడే లేడా అనే ప్రశ్నకు సమాధానం లేకుండానే బతుకుతున్నారు. మొన్నటివరకు సూపరింటెండెంట్‌గా కొనసాగిన డాక్టర్ ప్రతిమారాజ్ జల్లాలకు, ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడానికి సరిపోయారే తప్ప ఇటువంటి వారిని పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వీరికి చికిత్సలు చేసి మానవత్వం చాటుకోవాలని పలువురు కోరుతున్నారు.

కాల్వ భూమిని కబ్జా చేసిన రియల్ వ్యాపారి

● గ్రామస్థుల ఆందోళన ● పొక్లెయినర్‌తో చదును ● తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు


నడిపల్లి శివారులో కాలువను చదును చేస్తున్న దృశ్యం


రియల్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

డిచ్‌పల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నడిపల్లి శివారులో నిజామాబాద్- డిచ్‌పల్లి రహదారి పక్కన వ్యవసాయ పంట పొలాలకు సాగు నీరు అందించే కాలువను డిచ్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఓ రియల్ వ్యాపారితో కలిసి కాంగ్రెస్ నాయకులు కబ్జా చేశారు. దీంతో నడిపల్లి గ్రామ వీడీసీ సభ్యులు బుధవారం ఆందోళనకు దిగారు. కబ్జాకు గురైన కాలువను పొక్లెయిన్ సహాయంతో చదును చేయించారు. తహసీల్దార్ ప్రభాకర్‌కు కలిసి ఫిర్యాదు చేశారు. కాలువలో మట్టి పోసి కబ్జా చేయడం వల్ల వైబాగానికి ఉన్న పంట పొలాలు మునిగి పోతున్నాయని, పంట పొలాలకు సాగు నీరు అందించే కాలువను కబ్జా చేయడం వల్ల పంట పొలాలకు సాగు నీరు అందకుండా పోతుందని తమ పంట పొలాలు ఎండిపోయే ఆస్కారం ఉంటుందని కబ్జా చేసిన కాంగ్రెస్ నాయకులు, రియల్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని వారుడిమాండ్ చేశారు.

పచ్చలనడ్కుడలో గాలిపటాలు పంపిణీ


పచ్చలనడ్కుడలో గాలి పటాలను పంపిణీ చేస్తున్న రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి

వేల్పూర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాలిపటాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి ప్రారంభించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 200కు పైగా గాలిపటాలను యువకులకు, పిల్లలకు అన్వేశ్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, కిసాన్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు బుక్యా గంగాధర్, నాయకులు సెహెూ, మండల భోజన్న, బోండ్ల సదిన్, సుశాంత్, శీను పాల్గొన్నారు.

ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిది

● జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్

ఆర్మూర్‌రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీఒక్కరిపై ఉందని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంవీఐ కార్యాలయం వద్ద జాతీయరోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ 75శాతం రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల వల్ల జరుగుతున్నాయని, 25శాతం వాహన కండిషన్, రోడ్డు కండిషన్ లేకపోవడం వల్ల జరుగుతున్నాయన్నారు. డ్రైవింగ్‌లో చేయాల్సిన పన్ను చెల్లించిన వాహనదారులు ఈ నెల 30వ తేదీలోపు చెల్లించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వర్‌రావు, డాక్టర్ మధుశేఖర్, ఎంవీఐలు వివేకానందరెడ్డి, రాహుల్ కుమార్, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నందిపేటలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు

నందిపేటలో పోస్టర్ల కలకలం

● ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి రావద్దంటూ హెచ్చరికలు

నందిపేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు కలకలం రేపాయి. ఏడాది గడిచిన ఏ అభివృద్ధి పనిచేయ లేదంటూ ఆయనకు వ్యతిరేకంగా గుర్తుతెలియని వ్యక్తులు పలు ప్రధాన కూడళ్లలో, ఆలాగే వైన్స్‌ల వద్ద పోస్టర్లు వెలిశాయి. దీంతో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. రాష్ట్రాయికి కనీసం సొంత పైసాల్ తమ్ముడు... ఏ అడ్రస్ కు ఇది ఏమి బలం? ఏ ఏడాదిలో ఊరికి పది ఇళ్లు సొంతంగా ఎక్కడ కట్టించావు? హిందువులు అంటూ రెచ్చగొట్టే ఏ ఆలయాలకు విరాళాలు ఇచ్చావు? అంటూ పోస్టర్లు వెలిశాయి. అంతేగాకుండా హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే ఇంటికి ప్రజలు ఎవరు రావద్దంటూ పేపర్లన్నారు ఎందుకు చూలకనగా చూస్తున్నావ్? ఉపాధి కోసం వీసాలకు ఎంత మంది యువకులను పంపావ్? ప్రభుత్వ అధికారులతో దురుసుగా ప్రవర్తిస్తావ్ ఎందుకు? అంటూ నందిపేటలో వెలిసిన పోస్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు పేర్కొన్నారు. దీంతో బీజేపీ నాయకులు నందిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కాలభైరవ స్వామి ఆలయంలో వైభవంగా సింధూర పూజలు



రామారెడ్డి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలో మీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలిసిన దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో పురోహితులు శ్రీనివాస్ శర్మ మంత్రోచ్ఛారణలతో పాలాభిషేకం, సింధూర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక క్యూ లైన్ ద్వారా భక్తులు వివిధ మొక్కులు చెల్లించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే విధంగా కొందరు వివిధ రకాల పూజలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి కొందరు మొక్కిన కోరికలు తీరాలని కోరుతూ 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి పాదయాత్రతో తరలివచ్చి పూజలు నిర్వహించారు. భక్తులు కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించారు. అనంతరం శనేశ్వర, నాగదేవత, శివాలయం, నవగ్రహాల గుడి దేవుళ్లకు మొక్కులు మొక్కి పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయం వెనుక అవరణలో గల బావి నీటితో స్నానాలు చేసి తడి బట్టలతో భైరవుని గర్భగుడిలో తడిపూజలు నిర్వహించారు. ఒక్కొక్కరు ఒక్కో విధంగా భక్తులు హాజరై కబ్బకాసులకు సమర్పించారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన అయ్యప్పస్వాములు, భక్తులు శ్రీ కాలభైరవ స్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్ర ప్రభాకరచంద్రం గుప్తా, ఎస్ఐ నరేష్, వివిధ శాఖల అధికారులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, కామారెడ్డి ఎఎంసి డైరెక్టర్ దోమ కొండ శ్రీనివాస్ గుప్తా, ఆర్య వైశ్య అన్నదాన సత్రం అధ్యక్షుడు గంజి సతీష్ గుప్తా, వైద్యులు పాల్గొన్నారు.

బడిబయట బాల్యం.. చదువుకు దూరం!

● పనుల్లో మగ్గుతున్న బాల్యం ● బడిబయట పిల్లల సర్వేను చేపడుతున్న విద్యాశాఖ



బడి బయట పిల్లల సర్వే చేపడుతున్న విద్యాశాఖ సిబ్బంది

కామారెడ్డిటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి):విద్యాబుద్ధులు నేర్చాల్సిన పిల్లల బాల్యం ఇటుక బట్టీలు, కూలీ పనులు, వ్యాపారాలు, చెత్తకుండీల వద్దే మగ్గుతుంది. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి దృష్ట్యా చిన్నతనం నుంచే కుటుంబపోషణ భారాన్ని మోస్తున్నారు. పుస్తకాలు పట్టాల్సిన చేతులలో సుత్తెలు, తట్టలు, భుజానికి సంచులు కనిపిస్తున్నాయి. ఇలాంటి వారిని గుర్తించేందుకు ప్రభుత్వం ప్రతి యేటా బడిబయట పిల్లల సర్వేను చేపడుతుంది. ఇందులో భాగంగా ఈ నెల 30 వరకు విద్యాశాఖాధికారులు, సిబ్బంది ఈ ప్రక్రియను కొనసాగించి బడిబయట పిల్లలను గుర్తించే పనిలో పడ్డారు. చిన్నపిల్లలతో పనులుచేయించవద్దని వారి చిట్టిచేతులు చక్కని రాతలు రాయాలి కాని సుత్తెలు, తట్టలు మోయొద్దని నిర్బంధ విద్యను చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు. ఎవరైన చిన్నపిల్లలను పనులలో పెట్టుకుంటే చట్టపరంగా శిక్షలు వేస్తామని చెబుతున్న వ్యాపారులు మాత్రం తక్కువ జీతంకు పనిచేస్తున్నారని కడా అని చిన్నపిల్లలను పనులకు పెట్టుకుంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఈ నెల 30 వరకు సర్వే

రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం 6-14 ఏళ్ల పిల్లలకు ప్రభుత్వం ఉచిత నిర్బంధ విద్యను అందిస్తోంది. ఆయిన చాలామందితల్లిదండ్రులు తమ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా లేక జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో పిల్లల చదువు మధ్యలోనే మాన్పించేస్తున్నారు. పిల్లలు కూడా తల్లిదండ్రులు పనిచేసే చోటే ఉంటూ బడికి దూరమవుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రతి మండలం, ప్రతినివాస ప్రాంతం, ప్రతిబస్తీల్లో క్షేత్రస్థాయిలో సందర్శించి సర్వే నిర్వహిస్తున్నారు. ఈనెల 3 నుంచి ఈ సర్వే కొనసాగుతుండగా 30 వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో పూర్తిచేయనున్నట్లు తెలిపారు.జిల్లాలో ఇతరరాష్ట్రాల నుంచి వచ్చిన వారితో పాటు నిరుపేద కుటుంబాలలో ఎక్కువ. పేదకుటుంబాలకు చెందిన బాలలు బడికి వెళ్లాల్సిన సమయంలో బయట కన్పిస్తున్నారని విద్యాశాఖాధికారులు పేర్కొంటున్నారు.

పనిచేసే చోటే ఎక్కువ

జిల్లాలో ఎక్కువగా ఇటుక బట్టీలు, ఇసుప వస్తువులు తయారీదారులు, రోడ్డుసైడ్ వ్యాపారం చేసే వారి వద్ద పనిచేసే వారు ఎక్కువగా ఉన్నారు. మహారాష్ట్ర, బీహార్, ఒడిశా, యూపీ రాష్ట్రాల నుంచి కూలీ పనుల కోసం వలస వస్తుంటారు.స్థానికంగా వ్యవసాయకూలీలుగా, ఇటుక బట్టీలు, పౌల్ట్రీఫాంలు, భవన నిర్మాణ రంగంలో ఉపాధి పనులు చేస్తుంటారు. దీంతో బడిమానేసిన వారిలో పిల్లలే ఎక్కువగా ఉంటున్నారు.ముఖ్యంగా ఇటుక బట్టీలు, వంట దేవ్రల్, ఇనుప వస్తువులు తయారీ,ఉమ్మకాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే విద్యార్థులు బడిబాట పట్టె అవకాశాలు ఉన్నాయని విద్యావంతులు పేర్కొంటున్నారు. ఈ అంశంపైన సైతం దృష్టిసారిస్తామని పిల్లలను బడిబయట ఉంచకుండా చూడాలని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు.

తల్లిదండ్రులు సహకరించాలి

● రాజు, డీఈవో,కామారెడ్డి

బడిబయట బాల్యం ఉండకూడదనే ప్రభుత్వం 6-14 ఏళ్ల వయస్సుగల పిల్లలను ఉచిత నిర్బంధ విద్యను అందజేస్తుంది. ప్రతియేటా ఈ సర్వే నిర్వహిస్తున్న పనులు చేస్తున్న చోటే పిల్లలు ఎక్కువగా బడులకు వెళ్లకుండా కనిపిస్తున్నారు. అట్లాంటి వారి కోసం త్వరలో ప్రత్యేక ప్రణాళిక తయారుచేసి విధంగా కృషిచేస్తాం. జిల్లాలో ఈనెల 30 వరకు సర్వే చేసి బడిబయట పిల్లలను గుర్తిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను బడులకు పంపేందుకు సహకరించాలి.



ముగ్గు వేస్తున్న భవాని

ఎంపీ అర్వింద్‌కు ముగ్గుతో కృతజ్ఞత

సుభాష్‌నగర్, జనవరి15 (ఆంధ్రజ్యోతి): పసుపు బోర్డు ఏర్పాటుకు కృషి చేసిన ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞత భావంతో జిల్లాకు చెందిన భవాని తన ముగ్గుద్వారా కృతజ్ఞత తెలిపింది. జిల్లాకేంద్రంలోని బోర్గాంకు చెందిన భవాని కోటగల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. కేంద్రప్రభుత్వం పసుపు బోర్డును ఏర్పాటు చేయడంతోపాటు నిజామాబాద్ జిల్లాకు చెందిన పల్లె గంగారెడ్డిని జాతీయ పసుపుబోర్డు చైర్మన్‌గా నియమించినందుకు, ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతగా ముగ్గువేసింది. ఈ ముగ్గులో ప్రధానమంత్రి నరేంద్రమోదీతోపాటు ఎంపీ అర్వింద్‌ల ఫొటోలను ముగ్గులో చిత్రించింది. తనకు ఇంకా ఓటుహక్కు లేదని, మొదటి ఓటు రాగానే తన కృత జ్ఞతను మరలా తెలుపుతానని తెలిపింది.

ఘనంగా సిద్దుల గుట్ట జాతర

ఇందల్వాయి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవెల్లి గ్రామంలో సిద్ధులగుట్ట జాతర ఉత్సవాలను రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు మంగళవారం రాత్రి భజన కార్యక్రమాలు, రెండో రోజు బుధవారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఊరు చివరన అడవిలో వెలసిన శివాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ నెలకొంది. ప్రతియేటా సిద్ధులగుట్ట జాతర ఉత్సవాలను నిర్వహిస్తామని వీడీసీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

రైతు భరోసా గ్రామ సభలను
సద్వినియోగం చేసుకోవాలి

డిచ్‌పల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 33 గ్రామాల్లో రైతు భరోసా గ్రామ సభలను ఈ నెల 16 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రభాకర్, ఆర్‌ఐ సంతోశ్ తెలిపారు. 16న బీబీపూర్, బీబీపూర్ తండా, డిచ్‌పల్లి, డిచ్‌పల్లి, తాండ, బర్దిపూర్ , ధర్మారం, సుద్దులం, 17న కమలాపూర్, కోరట్‌పల్లి, కోరట్‌పల్లి తాండ, దూస్‌గాం, నక్కలగుట్ట, నడిమి, గొల్లమట్ తాండ లు, 18న మిట్టపల్లి, మిట్టపల్లి తాండ, అరెపల్లి, సుద్దపల్లి, అమృతపూర్, దేవనగర్, గొలపల్లి, 19న రాంపూర్, నర్సింగపూర్, ముల్లంగి, సుద్దపల్లి, లింగ సముద్రం, దేవపల్లి, మెంట్రాజ్‌పల్లి, సాంపల్లి, సాంపల్లి తాండ, 20న ఘన్‌పూర్, గ్రామాల్లో జరిగే సభలను సద్వినియెగం చేసుకోవాలని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

టీయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

డిచ్‌పల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్, ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఫ్యాకల్టీ ఆఫ్ లా తదితర విభాగాలలో కేటగిరి-1 పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం సంబంధిత డీన్‌లు నోటిఫికేషన్‌లు జారీ చేయడం జరిగింది. యూజీసీ నెట్, సీఎస్‌ఐఆర్ నెట్ పరీక్షల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.పూర్తి వివరాల కోసం తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించగలరు.

రథంపై దర్శనమిచ్చిన గోదారంగనాథుడు

నిజామాబాద్ కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భోగిపండుగ రోజున అంగరంగ వైభవంగా వివాహం ఆడిన గోదారంగనాథుడు సంక్రాంతి పర్వదినాన భక్తులకు రథంపై దర్శనమిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని చక్రంగుడిలో గల లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవాలయంలోని గోదా రంగనాథుడు శ్రీదేవి భూదేవి సమేతుడై రథంపై పురవీధుల గుండా ఊరేగారు. ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం మేళతాళాలతో భక్తుల గోవింద నామస్మరణలతో బ్రహ్మపురి, గాజుల్‌పేట్, గురుద్వారా, రాణాగల్లీ, పెద్దబజార్, శివాజీ నగర్ మీదుగా ఆలయం వరకు సాగింది. రథోత్సవానికి భక్తులు మంగళహారతులు, కొబ్బరికాయలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న రథానికి ఆలయ అర్చకులు కందాళై నాగరాజ చార్య, రఘురామచార్య, నర్సింహమూర్తి, హైగ్రీవాచార్య ప్రత్యేక పూజలు నిర్వహించి డోలారోహణంతో ఉత్సవ విగ్రహాలను ఆలయానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పండితులు సేనాపతి శ్రీనివాసాచార్య, సముద్రాల రామాచార్య, నర్సింహాచార్య, గోవిందుల శ్రీవత్సన్, వైభవాచార్య, నానికొండ, సేనాపతి విష్ణుచిత్తన్, సన్నాయి గురునాథ్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉర్దూ భాషకు ప్రాధాన్యం

● ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందాన్

నిజామాబాద్ అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ భాషకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ప్రోత్సహించడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, అల్లామా ఇక్బాల్ వెల్ఫేర్ సొసైటీ, లైబ్రరీ అభివృద్ధికి సాధ్యమైన అన్ని చర్యలు తీసుకుంటుందని తెలంగాణ ఉర్దూ అకాడమి చైర్మన్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్‌హందాన్ అన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి, ప్రచారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మర చర్యలు తీసుకుంటుందని అన్నారు. అల్లామా ఇక్బాల్ వెల్ఫేర్ సొసైటీ, లైబ్రరీ పోర్ట్ సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. ఉర్దూ భాషను ప్రోత్సహించేందుకు ఉర్దూ ఉపాధ్యాయుల నియామకం అమలుచేస్తున్నామన్నారు. రాత్రిపూట జాగరణ చేసి పనికిరాని పనులకు దూరంగా ఉండాలని యువత తమ సామర్థ్యాలన్నింటిని వినియోగించుకోవాలని సూచించారు. ఉన్నత విద్య ద్వారానే దేశ, జాతి అభివృద్ధి సాధ్యమన్నారు. ఉన్నత విద్యపై సీరియస్‌గా ఉండనంత వరకు ఆర్థిక సమస్యలు వస్తాయని, అభివృద్ధి సాధ్యం కాదన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ ఉర్దూ తీసుకురావడానికి అన్నివిధాలా సహకారం అందిస్తామన్నారు. అంతకుముందు ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మహమ్మద్ ఉమర్, ఉర్దూ జర్నలిస్ట్ ముఖిత్ ఫారూఖీ, సప్దర్ హుస్సేన్, అజీమ్ మాలిక్, తదితరులు ఉన్నారు.

వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ

నిజామాబాద్ కల్చరల్, జనవరి15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఇందూరు విభాగ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు పెద్ద సంఖ్యలో బాలికలు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంక్రాంతి సంబురాలు సంస్కృతి, సంప్రదాయం అద్దంపట్టేలా ముగ్గులను వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వహిందూ పరిషత్ జిల్లాఅధ్యక్షుడు దినేష్‌ఠాకూర్ మాట్లాడుతూ ఇందూరు సంస్కృతి సంప్ర దాయంలో సంక్రాంతి పండుగకు ప్రత్యేకత ఉందని అన్నారు. అనంతరం పోటీలో గెలుపొందిన వారికి ఆరోగ్య రక్ష యోగా శిక్షకురాలు ఐశ్వర్య బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి దయానంద్, ఉపాధ్యక్షుడు ఆనంద్, శేఖర్, నికేష్, రజిత పాల్గొన్నారు.

మహాకుంభమేళకు పాదయాత్రగా వెళ్లిన జిల్లావాసి

నిజామాబాద్ కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక అయిన ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళకు జిల్లాకు చెందిన గోపికుమార్ పాదయాత్రగా వెళ్లాడు. 144 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహాకుంభ మేళలో పాల్గొనాలనే గొప్ప సంకల్పం చేసుకొని రోజుకు 60 కిలోమీటర్లు నడుచుకుంటూ 1100 కిలోమీటర్ల దూరంలోని ప్రయాగ్‌రాజ్‌కు జనవరి 3న చేరుకొని కుంభమేళలో పుణ్యస్నానాన్ని ఆచరించాడు. మహాకుంభమేళలో వివిధప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తనవంతుగా సేవా కార్యక్రమాలు అందించాలనే ఉద్దేశ్యంతో 45రోజులపాటు అక్కడే ఉండనున్నాడు.

వ్యవసాయ భూములకే రైతుభరోసా

ఇందల్వాయి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న భూములకే రైతుభరోసా వస్తుందని వ్యవసాయానికి యోగ్యం కాని భూములకు రైతుభరోసా ఉండదని తహసీల్దార్ వెంకట్రావుఅన్నారు. మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇళ్లు, రియల్ ఎస్టేట్, లేఅవుట్, పరిశ్రముల, గోదాములు, మైనింగ్ భూములు, ప్రభుత్వ భూములు, రాళ్లు గుట్టలతో కూడిన భూములు, సాగుకు అనుకూలంగా లేని భూముల సర్వే ప్రారంభిస్తామని తహశీల్దార్ తెలిపారు.

పసుపు కుంకుమ వితరణ

ధర్పల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు పసుపు కుంకుమ గాజులను పంపిణీ చేశారు. సంక్రాంతి సందర్భంగా నియమనిష్టలతో పూజలు నిర్వహించిన అనంతరం ప్రతియేటా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి పసుపు కుంకుమను ముత్తైదువలకు అందజేశారు. కార్యక్రమంలో రాంప్రసాద్, గంగాదాసు, రాములు, ప్రవీణ్‌కుమార్, రాజయ్య, గంగాబాబు, సిద్దేశ్వర్, రవీందర్, శేఖర్‌ల తోపాటు ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఉత్సవ విగ్రహాలను కల్యాణానికి తీసుకొస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా నీలకంఠేశ్వరుని కల్యాణోత్సవం

నిజామాబాద్‌కల్చరల్, జనవరి15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ఉత్తరాయన పుణ్యకాలాన్ని పురస్కరించుకొని ప్రతియేటా నిర్వహించే నీలకంఠేశ్వరుని కల్యాణోత్సవం నేత్ర పర్వంగా సాగింది. ఆలయంలో ప్రత్యేకంగా పూలు, మామిడి తోరణాలతో తయారు చేసిన కళ్యాణ వేదికపై శివపార్వతుల విగ్రహాలను ఉంచి కల్యాణ వేడుకలను జరిపారు. మంగళవారం నిర్వహించిన ఈ కళ్యాణోత్సవంలో వేదపండితులు వేలేటి పవన్‌కుమార్ శర్మ వేదమంత్రాలు పఠించగా ఆలయ అర్చకులు మకరంద్ శాఖాయ్, సుహాల్ శాఖాయ్, నీలేష్ శేఖర్‌లు కళ్యాణతంతును జరిపారు. కళ్యాణంలోని ముఖ్య ఘట్టాలైన యజ్ఞోపవిత దారణ, పాదప్రక్షాళణ, మధుపర్కం, జిల్లకర్ర బెల్లం, కన్యాధానం, మాంగళ్యసూత్రదారణ, తలంబ్రాలు, మాలాపరివర్తన, బ్రహ్మముడి తంతును అర్చకులు నిర్వహించగా భక్తులు శంభోశంకర హరహర మహాదేవ స్మరణతో ఆద్యాంతం కల్యాణ వేడుకను తిలకించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన మహాఅన్నప్రసాదంలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమీషనర్, ఆలయ ఈవో రవీందర్‌గుప్త, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు తిరుమలలో బారులు తీరిన భక్తులు

మోపాల్, జనవరి15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమల తిరుపతి వెంకటేశ్వర ఆలయానికి బుధవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ఆలయంలో ప్రతీనెలా పుష్యమి రోజున చిన్న పిల్లలకు అమృతప్రాసనం మందును వేయడం జరుగుతుందని సంక్రాంతి సెలవులు కావడంతో బుధవారం పిల్లలకు ఈ మందు వేయించడం కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు బారులుతీరారు. ఈరోజు సుమారుగా కొన్నివేలమంది పిల్లలకు మందు వేయడం జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఎప్పుడు ఇంత పెద్ద ఎత్తున పిల్లలకు మందు వేయించడం కోసం రాలేదని ఈరోజే ఎక్కువ సంఖ్యలో వచ్చారని తెలిపారు. వచ్చిన భక్తులందరూ వెంకటేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

సాగు భూముల గుర్తింపునకు సర్వే

(5వ పేజీ తరువాయి)

భూములను కూడా సర్వే నెంబర్ల వారిగా గుర్తించి నమోదు చేస్తారు. గ్రామాల్లో పరిశీలించిన భూములను అధికారులకు అందిస్తారు. మండల స్థాయిలో వ్యవసాయ అధికారి, తహశీల్దార్ వాటిని మరోదఫా పరిశీలించి ఉన్నతాధికారులకు పంపిస్తారు. ఆ తర్వాతే రైతుభరోసాను ఎకరాకు రూ.6వేల చొప్పున ఏడాదికి రూ.12వేలు అందిస్తారు. దీనికోసం ఐదు రోజుల పాటు సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. గ్రామాల్లో ముందుగా సాగులోఉన్న భూములను గుర్తిస్తారు. సాగుకు యోగ్యం కాని భూములను ప్రభుత్వం ఇచ్చిన నిబంధనల ప్రకారం గుర్తిస్తారు. వాటిలో ఇళ్ల స్థలాలు, రోడ్లు, ప్రభుత్వ భవనాలు, సాగు చేయని గుట్టలు, చెరువులు, ఇతర భూములను గుర్తిస్తారు. వాటి వివరాలను నమోదు చేసి డిజిటల్ సైన్‌చేసి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తారు. ఆయా గ్రామాల పరిధిలో మొత్తం సాగు భూములను ఈ సర్వేలో భాగంగా గుర్తించనున్నారు. సాగుకు యోగ్యం కాని భూములను నిర్ధారించి రైతుభరోసా నుంచి తొలగిస్తారు. సర్వేలో తొలగించిన భూముల వివరాలను కూడా ఆయా గ్రామాల పరిధిలోని పంచాయతీల నోటీస్ బోర్డులో పెట్టనున్నారు. జిల్లాలో సాగు భూములను గుర్తించేందుకు ఈ సర్వేను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లాలో 20 వరకు సర్వే నిర్వహించి పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సాగుచేసే రైతులకు భరోసా అందించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నామని తెలిపారు.

'జగజిత్‌సింగ్‌కు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్రానిదే'

నిజామాబాద్ కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జగజిత్‌సింగ్ దల్లేవాలాకు ప్రాణ ముప్పు ఉందని, రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభు త్వానిదేనని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి వెంకటరాములు, రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ అన్నారు. బుధవారం సంఘ కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లా డుతూ దొడ్డిదారిన మూడు నల్లచట్టాలు తీసు కొచ్చి రైతాంగాన్ని, వ్యవసా యాన్ని కార్పొరేట్ సంస్థలకు కొదువపెట్టే కుట్ర కేంద్ర ప్రభు త్వం చేస్తుందని అన్నారు. హర్యాన, పంజాబ్ రైతాంగం 750 మంది ప్రాణాలు కోల్పోయి నప్పటికీ 14 నెలల పాటు పోరాటం చేసి ప్రభుత్వం మెడలువంచి నల్ల చట్టాలను రద్దు చేసే విధంగా రైతులు ఉద్యమం చేశారని అన్నారు. జగజిత్‌సింగ్‌కు రక్షణ కల్పిస్తూ ఆయన నిరాహార దీక్షకు అనుమతి ఇవ్వాలని లేనిఎడల దేశవ్యా ప్తంగా అన్ని రైతు సంఘాల కార్మికఎస్‌కేఎం ఆధ్వర్యంలోజనవరి 26న ట్రాక్టర్ల పరేడ్ నిర్వహిస్తామని అన్నారు. ఈసమావేశంలో దేవేం దర్‌సింగ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

నగర శివారులో అగ్ని ప్రమాదం

ఖిల్లా, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని సారంగపూర్ ప్రాంతంలో బుధవారం అగ్ని ప్రమాదం ఘటన జరిగింది. ఈ ఘటనలో పెద్దగా ఆస్థి నష్టంతో పాటు ఎటువంటి ప్రాణహాని జరగలేదని సకాలంలో మంటలను ఆర్పడం జరిగిందని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు తెలిపారు. సారంగపూర్ పారిశ్రామిక ప్రాంతంలో ఓ దుకాణాదారుడు తన షాపులోని చెత్తా చెదారానికి నిప్పు పెట్టాడు. ప్రమాదశాత్తు నిప్పు రవ్వలు ఎగిసిపడి చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించింది. ఈ సమాచారాన్ని స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు తెలియజేయగా వారు సకాలంలో వచ్చి మంటలను ఆర్పారు. ఈ ఘటనలో ఒక బాలుడికి గాలికి గాయం కాగా, మేక మృతిచెందినట్లు తెలిపారు. మంటలు ఆర్పడంలో సిబ్బంది అనంతరావు, హరి, జయంత్, సతీష్, బస్వరాజ్‌లు ఉన్నారు.

ప్రాణాంతకంగా చైనామాంజ

(5వ పేజీ తరువాయి)

పాటు పక్షులు కూడా చైనామాంజాకు బలయ్యాయి. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని జైలుకు తరలిస్తున్న పోలీసులు నిషేధిత చైనామాంజా విక్రయాలను నియంత్రించకపోవడం, ఇప్పటివరకు చైనామాంజ విక్రయిస్తున్న వారిని జైలుకు పంపకపోవడం కొసమెరుపు.

● పోలీసు బాస్ లేకే..

పోలీసు కమిషనరేట్‌లో పూర్తిస్థాయి పోలీసు కమిషనర్ లేకపోవడంతో కిందిస్థాయి పోలీసులు నేరాలను అదుపు చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత కొంతకాలంగా జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలే పరేషాన్ అవుతున్న సమయంలో పండుగలో చైనామాంజ హల్‌చల్ చేస్తోంది. నిషేధిత చైనామాంజ విక్రయాలు కొనసాగుతుండడంతో వాటిని వినియోగించడంతో ప్రజలు దాని బారిన పడి గాయాలపాలైన ఘటనలు చోటుచేసుకున్నాయి.

● సీపీ నియామకంపై చొరవ చూపని వైనం

పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌సింగనేవార్ బదిలీ అయి రెండు నెలలైనా ఇప్పటివరకు పూర్తిస్థాయి పోలీసు కమిషనర్‌ను నియమించడంలో సంబంధిత శాఖాధికారులు చొరవ చూపడం లేదు. ఇన్‌చార్జీ పాలనతోనే సాగించడంతో పోలీసుకమిషనరేట్‌లో నేరాల సంఖ్య పెరుగుతున్నాయి. ముఖ్యమంత్రిస్థాయి ప్రజాప్రతినిధి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నా పోలీసు కమిషనర్‌ను నియమించడడంలో దృష్టిపెట్టకపోవడం గమనార్హం.

పసుపు రైతు కల నెరవేరింది

(5వ పేజీ తరువాయి)

విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. పసుపుబోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఇక్కడే ఏర్పాటుచేసి అడ్మినిస్ట్రేటీవ్ కార్యాలయాన్ని మాత్రం రాష్ట్ర రాజధానిలో ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. 20రాష్ట్రాల పరిధిలో సాగు అవుతుండటంతో అక్కడినుంచి కూడా వచ్చి వెళ్లేందుకు సులువుగా ఉండేలా హైదరాబాద్ చుట్టుపక్కల పరిపాలన భవనాన్ని ఏర్పాటుచేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయి బోర్డును మాత్రం నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేయనున్నారు. పసుపుబోర్డు కార్యాలయ ఏర్పాటు కోసం భవనాలను పరిశీలిస్తున్నట్లు చైర్మన్ పల్లె గంగారెడ్డి తెలిపారు. బోర్డు అధికారులు నిర్ణయం తీసుకొని త్వరలోనే కార్యాలయాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామన్నారు.

పసుపుబోర్డు ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

అన్నారు. దేశవ్యాప్తంగా 11లక్షల టన్నుల పసుపు ఉత్పత్తి అవుతుందన్నారు. ఏపీ, తెలంగాణలో నాణ్యమైన పసుపును సాగు చేస్తున్నారని అన్నారు. అందుకే పసుపు బోర్డును ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులకు సరైన గిట్టుబాటు వస్తుందని చెప్పారు. రైతులునాణ్యమైన పసుపు ఉత్పత్తికి మొగ్గు చూపాలని కోరారు.

● జిల్లాకు ఇంకా చాలా పరిశ్రమలు రావాలి


పసుపుబోర్డు ఏర్పాటుతోపాటు ఇంకా నిజామాబాద్‌కు చాలా పరిశ్రమలు వస్తాయని ఎంపీ అర్వింద్ అన్నారు. పసుపుబోర్డు ఏర్పాటుతో తన హామీ పూర్తికాలేదని, ఇంకా చాలా పనులు చేయాల్సి ఉందని అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు కేవలం రైతులకు కాదని, జిల్లా మొత్తానికి పర్యాటకంగా కూడా ఉపయోగపడుతుందని అన్నారు. రైతులకు మెరుగైన ధర, ఎగుమతులకు అవకాశం వస్తుందన్నారు. పసుపు నిలువ చేయడం, మార్కెటింగ్ చేయడం, ప్రాసెసింగ్ చేయడం, పరిశోధనశాఖ సహా అనేక రకాలుగా బోర్డు పనిచేస్తుందన్నారు. సంక్రాంతి పండుగ రోజు పసుపు బోర్డును ఏర్పాటు చేసిన ప్రధాని మోదీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

గత పాలకులు రైతులను మోసం చేశారు..

పసుపు బోర్డు ఏర్పాటులో గతంలో అనేక పార్టీలు రైతులను మోసం చేశాయని పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి అన్నారు. రైతులను ఏళ్ల తరబడి మోసం చేశారని విమర్శించారు. ఎంపీ అర్వింద్ 2019లోని పార్లమెంట్ ఎన్నికల్లో హామీఇచ్చి బోర్డును సాధించారని అన్నారు. ప్రధాని మోదీ మహబూబ్‌నగర్, నిజామాబాద్ బహిరంగ సభలలో ఇచ్చినహామీ మేరకు పసుపు బోర్డును ప్రకటించారని అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం చాలా రాష్ట్రాలు పోటీపడ్డా అవకాశం తెలంగాణకే వచ్చిందన్నారు. బోర్డు చైర్మన్‌గా పసుపు రైతులకు అండగా ఉంటానని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ పైడి రాకేష్‌రెడ్డి, నేషనల్ టర్మరిక్ బోర్డు డైరెక్టర్ రేమాశ్రీ, పసుపు బోర్డు అధికారి హేమలత, జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్ కులాచారి, తదితరులు పాల్గొన్నారు.

సంబురంగా సంక్రాంతి వేడుకలు

(5వ పేజీ తరువాయి)



ప్రత్యేక పూజలు నిర్వహించి బ్రాహ్మణులకు సంక్రాంతి దానాలను అందజేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఇళ్ల ముందు డూడూ బసవన్నలను తీసుకొచ్చి ఆడించారు. పలు ప్రాంతాల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీ, పిండివంటకాల పోటీ నిర్వహించి వేడుకలను జరుపుకున్నారు.

● ఆలయాల్లో ఉత్తరాయన పుణ్యకాల పూజలు

సంక్రాంతి పర్వదినాన సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే ఉత్తరాయన పుణ్యకాల పూజలను జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరాయన పుణ్యకాలంలో ముక్కోటి దేవతలు భక్తులకు దర్శనమివ్వడానికి దివినుండి భువికి వచ్చిన విశేషమైన రోజుగా మకర సంక్రాంతిని జరుపుకుంటారు. దీంతో ఆలయాల్లో, ఇళ్లలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయాల్లో వేదపండితుల వేదమంత్రోచ్చరణలతో అభిషేకాలు ప్రత్యేక అర్చనలు చేశారు. పలు ఆలయాల్లో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవాలయంలోని అమ్మవారికి నోములను నోచి సమర్పించుకున్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలకు పండుగశోభ నెలకొంది.

● నోములకు ప్రత్యేక పూజలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మహిళలు మూడు రోజులపాటు బొమ్మల కొలువును ఏర్పాటు చేసుకొని ప్రత్యేక పూజలు చేశారు. పండుగ రోజున ఉదయాన్నే బొమ్మల కొలువులో 13 నోములను ఉంచి పూజించి లక్ష్మీనారాయణుడికి తొలి నోమును అందజేశారు. ముత్తైదువులకు నువ్వులు, బెల్లంతో పాటు నోముల ను ఇచ్చి పండుగ శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు అందుకున్నారు. ఇంటికి వచ్చిన బంధుమిత్రులకు నువ్వులు, బెల్లం ఇచ్చి తియ్యగ తిని తియ్యగా మాట్లాడాలని కోరుతూ పండుగను జరుపుకున్నారు. కనుము రోజును పురస్కరించుకొని బొమ్మల కొలువులోని గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి వాయినాలను ఇచ్చుకున్నారు.

● గాలిపటాలతో యువత సందడి

పండుగను పురస్క రించుకొని గాలిపటాలతో యు వత సందడిచే శారు. ఇంటి డాబాలపై డీజేసౌండ్ సిస్టమ్ తో పాటలు వింటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలిపటాలతో బిజీబిజీగా గడి పారు. మార్కెట్‌లో లభించే రకరకాల పతంగులను, మాంజాలను తీసుకువచ్చి ఎగరవేస్తూ ఆనందోత్సహంగా గడిపారు. పతంగులను ఎగరవేస్తూ తోటివారి పతంగి పోగానే గిల్లీ అంటూ అరుపులు, కేకలతో ఉత్సాహంగా సంబరాలు చేసుకున్నారు.

CLASSIFIEDS

TO - LET

★ HANUMANDLA HEIGHTS COMMERCIAL SHOPPING MALL, 10,000 SFT, G+2 FLOORS, NEAR CLOCK TOWER, VEGETABLE MARKET ROAD, JAGTIAL, CELL : 9908522321

AJK-232205

CHANGE OF NAME

I, NAGA BHUSHANAM GANDLA (OLD NAME) H.NO. 3-156/C (VILL.) & MANDAL, NANDIPET, DIST.NIZAMABAD, T.G, HAVE CHANGED MY NAME AS GANDLA NAGA BHUSHAN S/O GANDLA GANGARAM (NEW NAME)

AJZ

Classifieds
మీ అభిమాన ఆంధ్రజ్యోతి
దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం
ప్రతి రోజు... క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-
నిజామాబాద్: 99484 06282

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.245	రూ. 260
వెన్‌కాబ్(కిలో)	రూ.135	రూ.245	రూ. 265

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.80,400	రూ.74,200	రూ.940

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.00, 1.05, 4.10, 7.15, 10.20)
స్క్రీన్-2 : డాకు మహారాజ్ (10.10, 1.20, 4.30, 7.40, 10.50)
స్క్రీన్-3 : గేమ్ చేంజర్ (11.50, 3.20, 6.50, 10.20)
స్క్రీన్-4 : పుష్ప-2 (10.25, 6.00, 10.05)
: గేమ్ చేంజర్ (2.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (11.00, 1.40, 4.30, 7.30, 10.20)
స్క్రీన్-2 : గేమ్ చేంజర్ (10.20, 1.20, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-3 : డాకు మహారాజ్ (11.00, 1.35, 4.25, 7.20, 10.20)

దేవి : డాకు మహారాజ్ (11.00, 2.00, 6.00, 9.00)
నటరాజ్ : గేమ్ చేంజర్ (హిందీ) (11.00, 2.00, 6.00, 9.00)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (10.00, 2.00, 6.00, 10.00)
లలితామహల్ : గేమ్ చేంజర్ (11.00, 2.00, 6.00, 9.00)

- నిజామాబాద్ అర్బన్